క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

13-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక:234

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

‘భారత్ సమ్మిట్’..
నవ్వుల పాలు!

కాంగ్రెస్ భావజాల ప్రచారానికి పరిమితం

రాహుల్ గాంధీని గ్లోబల్ లీడర్ గా చెప్పే ప్రయత్నం

చుట్టూ ముసురుకుంటున్న రాజకీయ వివాదం



తెలంగాణకు భారీగా పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చేందుకు హైదరాబాదులో భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. అయితే ఇది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, భావజాలాన్ని అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరించడమేనన్న అభిప్రాయం బలపడుతోంది. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఒక గ్లోబల్ లీడర్ గా ప్రొజెక్ట్ చేస్తూ.. నెహ్రూ గాంధీల నాటి విదేశాంగ విధానాలను ప్రమోట్ చేయడమే ఈ సదస్సు వెనుక అసలైన రాజకీయ అజెండా అను స్పష్టమవుతుంది.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సైద్ధాంతిక ప్రచార సభలను నిర్వహించుకోవడం కొత్త కాదు. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజల పన్నుల సొమ్ముతో, ప్రభుత్వ ఖజానా నిధులతో అధికారికంగా రాహుల్ గాంధీ వీఆర్ వ్యాయామాన్ని నడపడమే ప్రధాన అభ్యంతరకరంగా మారింది.

వ్యూహాత్మక తప్పిదం..

ఈ పెట్టుబడుల సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదం స్పష్టంగా తెలుస్తోంది. ఒక రాజకీయ, సిద్ధాంతపరమైన సదస్సుకు పెట్టుబడుల సమ్మిట్ అనే కలరింగ్ ఇవ్వడమే. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ కు రాహుల్ గాంధీ వచ్చినప్పుడే విపక్షాలు దీనిని రాజకీయ


- మిగతా 3వ పేజీలో

23 మున్సిపాలిటీలకు ఎన్నికలు!

నాలుగు నగరపాలక సంస్థలకు సైతం

షెడ్యూల్ విడుదల

26న పోలింగ్, 28న లెక్కింపు



క్రైమ్ మిర్రర్,, ఏపీ బ్యూరో: ఏపీలో మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

మిగతా 2లో

ఇంటర్ బోర్డు రద్దు!

తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం

పాఠశాల విద్యాశాఖలో విలీనం

ఇకనుంచి స్కూల్ ప్రాంగణంలోనే జూనియర్ కాలేజీలు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ఇంటర్ బోర్డు రద్దయింది. విద్యారంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులకు రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దశాబ్దాలుగా

మల్లారెడ్డికి షాక్!

ఇకనుంచి విద్యాసంస్థల ప్రాంగణంలో ఈవెంట్లు కుదరదు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కీలక సిఫారసులు

ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు




క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

మల్లారెడ్డికి షాక్ తగిలింది. ఇకనుంచి ఆ విద్యాసంస్థల్లో సినిమాతో పాటు ఇతర ఈవెంట్ల నిర్వహణ కష్టంగా మారనుంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఇటీవల విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతపై సమగ్ర చట్టం తీసుకురావాలని కోరుతూ ఒక ముసాయిదా నివేదికను రూపొందించి... ప్రభుత్వానికి సమర్పించారు.

ఇందులో భద్రతా ప్రమాణాలు పాటించిన విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడం, భారీ జరిమానాలు విధించడం, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం వంటి కఠిన సిఫార్సులు ఉన్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మల్లారెడ్డికి షాక్ తగిలినట్లే.

- మిగతా 3వ పేజీలో



సినిమాగా సోనియా ఆత్మకథ!

తానే రూపొందిస్తానని చెప్పిన జగ్గారెడ్డి

నిర్మాణానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచన

అధినాయకత్వాన్ని కాకా పట్టేందుకేనని సొంత పార్టీలో విమర్శలు

మిగతా 2లో



బిజెపి దూకుడు!

తెలంగాణకు వరుసగా అగ్ర నేతలు

ఈనెల 18న కరీంనగర్ కు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

మహా పాదయాత్రకు హాజరు

లక్ష మంది జన సమీకరణ

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో బిజెపి వేగం పెంచింది. చాలా దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటుంది. ముఖ్య నేతలు క్యూ కొడుతున్నారు. ఇప్పటికే కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాదులో పాదయాత్ర నిర్వహించారు.

మిగతా 2లో



రేవంత్‌తో నాగార్జున రాజీ!

తుమ్మిడి కుంట చెరువు ప్రారంభోత్సవానికి హాజరు

నాగ్ ను అభినందనలతో ముంచెత్తిన ముఖ్యమంత్రి

ఎన్ కన్వెన్షన్ కూల్చి వేసిన చోట వేదిక

తెలంగాణలో ఆసక్తికర పరిణామం

క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: మాదాపూర్ తుమ్మిడి కుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అది కూడా సినీ నటుడు నాగార్జున సమక్షంలోనే ప్రారంభించడం విశేషం.. రాజకీయాల్లో మొండితనం ఒక ఎత్తు అయితే.. పంతాన్ని నెగ్గించుకుంటూనే ప్రత్యర్థిని తనదారికి తెచ్చుకునే గడుసుతనం ప్రదర్శించడం రేవంత్ రెడ్డికి మాత్రమే సాధ్యం. కెసిఆర్ పదేళ్ల హయాంలో హైటెక్ సిటీ నడిబొడ్డున ఉన్న సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్

పవన్ కళ్యాణ్ కుటుంబంపై
దూషణలు!

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు

కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్న పోలీసులు

44 సోషల్ మీడియా హ్యాండిల్స్ పై అవనిగడ్డ పోలీస్ స్టేషన్ లో కేసులు



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో అసభ్యకరమైన, కించపరిచే పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఆయన కుటుంబ వ్యవహారాలపై హద్దులు దాటి దూషణలకు దిగడంతో పాటు తీవ్ర అభ్యంతరకర రీతిలో రోలింగ్కు పాల్పడిన

మిగతా 2లో





పోలీస్ శాఖలో భారీ మార్పులు..

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్.. సజ్జనార్‌కు కొత్త బాధ్యతలు!

తెలంగాణ పోలీస్ శాఖలో ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం

ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లోనూ కొత్త నియామకాలు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్

ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్.. ఎస్పీఎఫ్ బాధ్యతలు కూడా

లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియామకం

మిగతా 2లో



పోలీస్ శాఖలో భారీ మార్పులు..

హైదరాబాద్, నవంబర్ 12 : తెలంగాణ పోలీస్ వ్యవస్థలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణతో పాటు నేరాల నియంత్రణ, మహిళల రక్షణ, ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థంగా నడిపించడమే లక్ష్యంగా పలువురు ఉన్నతాధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ముఖ్యంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త అధిపతిని నియమించడంతో

పోలీస్ శాఖలో భారీ మార్పులు..

పాటు ఇప్పటివరకు నగర పోలీస్ బాస్‌గా వ్యవహరించిన వీసీ సజ్జనార్‌ను మరో కీలక విభాగానికి పంపించింది. మొత్తం 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీఓ ఆర్టీ నంబర్ 1654 ద్వారా ఈ ఆదేశాలు జారీ చేశారు. నగర పోలీస్ కమిషనర్‌గా ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్) బాధ్యతలు నిర్వహించిన మహేశ్ మురళీధర్ భగవత్‌ను నియమించారు. సజ్జనార్‌కు తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డీజీగా బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీగా అదనపు బాధ్యతలు కూడా ఇచ్చారు. అకున్ సబర్వాల్‌కు రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ హోదాలో బాధ్యతలు కేటాయించారు. కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి.

మహిళా భద్రత, కీలక విభాగాల్లో మార్పులు

మహిళల రక్షణ, నేర పరిశోధన, అవినీతి నిరోధక వ్యవస్థల్లోనూ ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. డాక్టర్ సౌమ్య మిశ్రాకు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీగా బాధ్యతలు అప్పగించింది. ఆర్గనైజేషన్ అండ్ లీగల్ విభాగం అదనపు డీజీపీ బాధ్యతలను కూడా ఆమెకు ఇచ్చింది. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమించడంతో పాటు హోంగార్డ్స్ డీజీపీ బాధ్యతలు కేటాయించింది. చారు సిన్హాకు ఏసీబీ డీజీగా, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇతర అధికారులకు కేటాయించిన పోస్టులు

డాక్టర్ అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. వై. నాగిరెడ్డికి పౌరసరఫరాల శాఖ కమిషనర్‌తో పాటు ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ, లీగల్ మెట్రాలజీ బాధ్యతలు ఇచ్చారు. విక్రమ్ సింగ్ మాన్‌కు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగాలను కేటాయించారు. ఎం. స్టీఫెన్ రవీంద్రకు టీజీ-టీఎంఏఆర్ఎస్ డైరెక్టర్ పోస్టు ఇచ్చారు. సంజయ్ కుమార్ జైన్‌కు అదనపు డీజీపీ (ట్రైనింగ్) బాధ్యతలు అప్పగించారు. ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్‌గా నియమించారు. కార్తికేయకు మల్టీ జోన్-1 ఐజీతో పాటు ఐసీసీసీ డైరెక్టర్ బాధ్యతలు ఇచ్చారు. కె. రమేష్ నాయుడును రైల్వేస్ ఐజీగా నియమించారు. డి. జోయల్ డేవిస్‌కు టీజీ-టీఎంఏఆర్ఎస్ రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు కూడా కేటాయించారు.జి. చందన దీప్తికి జోన్-7 (జోగులాంబ/గద్వాల) డీఐజీ బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆర్. భాస్కరన్‌ను ఇంటెలిజెన్స్ డీఐజీగా నియమించారు. కె. నారాయణ నాయక్‌కు జోన్-2 (బాసర) డీఐజీ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఎల్.ఎస్. చౌహాన్‌ను కోఆర్డినేషన్ డీఐజీగా నియమించి, జోన్-6 బాధ్యతలు కూడా కేటాయించారు. శ్రీబాలా దేవికి టీజీ-టీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) పోస్టు ఇచ్చారు. వి. అరవింద బాబును హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇంటర్ బోర్డు రద్దు!



కొనసాగుతున్న ప్రత్యేక ఇంటర్మీడియట్ బోర్డు విద్యా విధానాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దాని స్థానంలో సీబీఎస్ఈ, ఐ సి ఎస్ ఈ బోర్డుల తరహాలో.. 10+2 విధానాన్ని ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ నూతన విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణను, విధివిధానాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారిక విలీనం..

ప్రస్తుతం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు స్వతంత్రంగా పనిచేస్తుంది. ఈ నూతన సంస్కరణ ప్రకారం ఇంటర్ విద్యను పాఠశాల విద్యాశాఖలో అధికారికంగా విలీనం చేయనున్నారు. దీనివల్ల పదో తరగతి అనంతరం విద్యార్థులు వేర్వేరు జూనియర్ కళాశాలలో చేరాల్సిన అవసరం లేదు. పాఠశాల ప్రాంగణంలోని నేరుగా 11వ తరగతి, 12వ తరగతి విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది. జాతీయ విద్యా విధానం మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను నిరంతరాయంగా అందించడం, పదో తరగతి తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకించి బాలికల్లో పెరుగుతున్న డ్రాపౌట్లను అరికట్టడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రపంచ స్థాయి పోటీకోసమే

తెలంగాణ విద్యార్థులు ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా.. అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత అని అర్థం అవుతోంది. కేవలం సర్టిఫికెట్ల కోసమే కాకుండా.. 12వ తరగతి పూర్తయ్యే సమయానికి విద్యార్థుల్లో స్వయం ఉపాధి, ఉన్నత విద్యకు అవసరమైన నైపుణ్యాభివృద్ధిని జోడించేలా పాఠ్య ప్రణాళికను రీడిజైన్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, ల్యాబ్లు, లైబ్రరీలను బలోపేతం చేయడంతో పాటు పౌష్టికాహారాన్ని అందించి అన్ని వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ వ్యవస్థాగత మార్పు ద్వారా రాష్ట్రంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలు సాగిస్తున్న కార్పొరేట్ దోపిడీకి, విద్యార్థులపై పడుతున్న మితిమీరిన మానసిక ఒత్తిళ్లకు చెక్ పడుతుందని విద్యా నిపుణులు భావిస్తున్నారు.

రేవంత్‌తో నాగార్జున రాజీ!

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ నిర్మాణాలపై విమర్శలు వచ్చాయి. బుల్డోజర్లు బయలుదేరినట్లే వెళ్లి వెనక్కి తగ్గాయి. కనీసం ఆ కట్టడాన్ని ఎవరూ ముట్టుకోలేకపోయారు. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రంగంలోకి దింపిన హైదరాబాద్ తెల్లవారుజామునే బుల్డోజర్లతో ఎం కన్వెన్షన్ ను నేలమట్టం చేయించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఎంతటి బడా బాబుల నైనా వదిలేది లేదన్న సంకేతాన్ని పంపడమే కాకుండా.. ఆ వివాదాల చెరువును ఏకంగా 20 కోట్ల రూపాయల వ్యయంతో ఆధ్యాధునిక వాకింగ్ ట్రాక్, పార్కులతో సుందరీకరించి ప్రజాక్షేత్రానికి అప్పగించారు.

అప్పట్లో సంచలనం..

ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే అప్పట్లో హైడ్రా చర్యలు వివాదాస్పదం అయ్యాయి. నాడు తన కోట్ల రూపాయల కట్టడం కూలిపోవడంతో న్యాయ పోరాటానికి సిద్ధపడ్డారు నాగార్జున. అయితే అదే నాగార్జున ఇప్పుడు అదే తొమ్మిది కుంట చెరువు ప్రారంభోత్సవ వేదికపై నిలబడడం వెనుక రేవంత్ మార్కు రాజకీయ వ్యూహం ఉంది. ఒక నాయకుడిగా



తన చర్య పట్ల నాగార్జున లో ఉన్న అసహనాన్ని, వ్యతిరేకతను పూర్తిగా తుడిచి పెట్టేలా.. చెరువు అభివృద్ధికి ఆయన సహకరించాలని స్వయంగా సీఎం ప్రశంసించడం, సన్మానించడం ద్వారా వివాదానికి అత్యంత నాటకీయమైన సుఖాంతాన్ని ఇచ్చారు. కూల్చివేసిన వాడే సత్కరించి, కూల్చివేసిన చోటే వేదికపై నిలబడి నవ్వేలా చేసిన ఈ దృశ్యం తెలంగాణ రాజకీయ వర్గాలను సైతం విస్తుపోయేలా చేసింది.

ఆలోచింపజేసిన నాగార్జున వ్యాఖ్యలు

మరోవైపు ఇదే వేదికపై నాగార్జున చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేసాయి. గతంలో తనను కొందరు తప్పుదాపు పట్టించారని.. ఈ స్థలం విషయంలో జరిగిన పరిణామాలపై మొదట్లో బాధపడ్డాను అని.. ఇప్పుడు ఈ చెరువు ప్రజలకు ఎంత ఆహ్లాదాన్ని ఇస్తుందో చూస్తుంటే నిజంగా ఆనందంగా ఉందన్నారు. పైకి వెళ్లేటప్పుడు ఎవరూ డెబిట్ కార్డులు, ఆస్తులను వెంట తీసుకుపోము కదా అంటూ నాగార్జున నవ్వుతూ పలికిన వ్యాఖ్యలు ఆలోచింపజేశాయి. తప్పు జరిగిందని పరోక్షంగా అంగీకరిస్తూనే ప్రజా ప్రయోజనాల ముందు వ్యక్తిగత నష్టాన్ని పక్కన పెట్టానని చాటి చెప్పేలా నాగార్జున చాలా హుందాగా ఒప్పుకున్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ సైతం నాగార్జునను రియల్ హీరోగా అభివర్ణించారు. నగర అభివృద్ధికి, భవిష్యత్తు తరాల కోసం చెరువుల సంరక్షణకు ముందుకు వచ్చిన నాగార్జునను ఆదర్శంగా తీసుకోవాలంటూ ప్రశంసల జల్లు కురిపించారు. తుమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవం పుణ్యమా అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నాగార్జున మధ్య ఉన్న పాత విభేదాలు సమసిపోయినట్టే.

బిజెపి దూకుడు!



(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నెలలో ప్రధాని మోదీ పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోంది. పక్కా రాజకీయ వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇకనుంచి ప్రతి నెల జాతీయ నాయకుల పర్యటనలు ఉండనున్నాయి తెలంగాణలో. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా నేతల పర్యటనలు ఉండబోతున్నాయి.


బెంగాల్ తర్వాత..


బెంగాల్ తర్వాత తమ లక్ష్యం తెలంగాణ అని బిజెపి ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే ప్రణాళిక ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్ల వ్యవధి ఉండడంతో వేగం పెంచింది. ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ లో పర్యటించారు. మహా పాదయాత్రలో పాల్గొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తో పాటు ఇండికూటమిపై తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్ తర్వాత ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు ఉత్తర తెలంగాణ. ముఖ్యంగా కరీంనగర్లో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని బిజెపి నిర్ణయించింది. నవంబర్ 18న భారీ మహా పాదయాత్ర చేపట్టనుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హాజరుకానున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కరీంనగర్ జిల్లాకు వస్తుండడంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు లక్ష మంది ప్రజలు, కార్యకర్తలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జాగ్రత్త పడిన బిజెపి..

దేశవ్యాప్తంగా సర్ పై కాంగ్రెస్ తో పాటు ఇండియా కూటమి చేస్తున్న ప్రచారంపై బీజేపీ జాగ్రత్త పడింది. ఈ ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్ కు వస్తుండడంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ డిసైడ్ అయ్యారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ మహా పాదయాత్రలో పాల్గొంటారు.

సినిమాగా సోనియా ఆత్మకథ!





(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తన ఆత్మ కథను రాసుకున్నారు. బి లాగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్ పేరుతో తాను రాసిన పుస్తకాన్ని మార్కెట్లో విడుదల చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా భిన్న చర్చ నడుస్తుండగా.. పూర్తిగా విధేయత ప్రదర్శించారు సంగారెడ్డి ఫైర్ బ్రాండ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి. సోనియా గాంధీ జీవిత చరిత్రను తెలుగులో సినిమా తీస్తానంటూ సంగారెడ్డి కార్యకర్తల సమావేశంలో ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపోయేలా చేశారు. జాతీయస్థాయిలో ఆ పుస్తకం పై రచ్చ జరుగుతుంటే.. జగ్గారెడ్డి మాత్రం డైరెక్టర్ అవతారం ఎత్తి యాక్షన్, కట్ చెప్పేందుకు రెడీ అయ్యారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రొడక్షన్ ప్లానింగ్ వింటే హాలీవుడ్ కార్పొరేట్ కంపెనీలు కూడా నోరేళ్లబెట్టాల్సిందే.

బడ్జెట్ పెట్టరట

జగ్గారెడ్డి సినిమా తీస్తారన్నది ఒక ఎత్తు అయితే.. దానికి కావాల్సిన బడ్జెట్ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే సమకూర్చుకోవాలని... అందరూ జేబుల్లో డబ్బులు రెడీగా పెట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే కథ సోనియాగాంధీది.. దర్శకత్వ ప్రతిభ జగ్గారెడ్డిది.. నిర్మాణం మాత్రం క్షేత్రస్థాయి కార్యకర్తలపై పెట్టారు. సినిమాకు మీరే నిర్మాతలు అంటూ సెలవిచ్చారు. వెంటనే చందాలు వేసుకోండి అంటూ పురమాయించారు. అయితే ఇప్పుడు సినిమా ఫండింగ్ పై దృష్టి పెట్టారు కార్యకర్తలు. అయితే ఇదంతా కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి కాకా పట్టేందుకు జగ్గారెడ్డి ఇటువంటి ఎత్తుగడలు వేస్తున్నారని సొంత పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.

ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్ గాంధీ భార్యగా.. రాహుల్ గాంధీ, ప్రియాంక తల్లిగా సోనియాగాంధీ చేసిన త్యాగాలను వెండితెరపైకి చూపిస్తానని జగ్గారెడ్డి సెలవిచ్చారు. అయితే టాలీవుడ్ జనాలు మాత్రం జగ్గారెడ్డి మార్కు సినిమాలో క్లైమాక్స్ ఎలా ఉంటుందోనని అప్పుడే ఊహించుకుంటున్నారు. పీవీ నరసింహారావును ప్రధాని చేయడం, మన్మోహన్ సింగ్ కు పగ్గాలు ఇవ్వడం వంటి సీన్లను ఎలా చూపిస్తారో పక్కన పెడితే.. సినిమా ముహూర్తం షాట్ కు సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్లతో క్లాప్ లు కొట్టి ప్రారంభిస్తారు. ఆమధ్య రేవంత్ రెడ్డి పై అలిగి, మళ్లీ కలిసి.. ఇప్పుడు ఏకంగా రేవంత్ చేతుల మీదుగానే సినిమా మొదలు పెడతానని చూస్తుంటే . ఐ కమాండ్ దృష్టిలో మార్కులు కొట్టేయడానికి అని అర్థమవుతోంది.

పవన్ కళ్యాణ్ కుటుంబంపై దూషణలు!

విపక్ష పార్టీ సానుభూతిపరులకు చెందిన 44 సోషల్ మీడియా హ్యాండిల్స్ పై కేసులు నమోదయ్యాయి. కృష్ణాజిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్ లో అధికారికంగా కేసులు నమోదు చేశారు. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన సెక్షన్ల కింద ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

డిజిటల్ ప్లాట్ ఫామ్ లపై చర్యలు..: పవన్ కుటుంబం పై దూషణలకు సంబంధించి కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాదు.. డిజిటల్ ప్లాట్ ఫామ్ లపై చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా ఎక్స్ కార్పొరేషన్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర అంతర్జాతీయ సంస్థల లీగల్ అండ్ సేఫ్టీ విభాగాలకు పోలీసులు అధికారిక నోటీసులు జారీ చేశారు. వివాదాస్పద పోస్టులు, వీడియోలకు సంబంధించిన లింకులను పొందుపరుస్తూ.. నోటీసు అందిన 36 గంటల్లోగా ఆయా అకౌంట్లు, అభ్యంతర కర యు ఆర్ ఎల్ లను తక్షణమే తొలగించాలని.. డిసేబుల్ చేయాలని చట్టబద్ధమైన ఆదేశాలు ఇచ్చారు.

ఆదేశాలు బేఖాతరు..: పవన్ కళ్యాణ్ వ్యక్తిగత వ్యవహారానికి సంబంధించి సోషల్ మీడియాలో పోస్టుల విషయంలో సంయమనం పాటించాలని ఎప్పటికీ రెండు ప్రధాన పార్టీ అగ్ర నాయకత్వాలు ఆదేశాలు ఇచ్చాయి. అయినప్పటికీ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. సదరు 44 ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో ఐపి అడ్రస్ లు, డిజిటల్ ఆధారాల ద్వారా గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా వేదికగా మహిళలను, కుటుంబ సభ్యులను అవమానించే వారిని చట్టం ముందు నిలబెట్టి కట్టిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

23 మున్సిపాలిటీలకు ఎన్నికలు!

పెండింగ్లో ఉన్న నాలుగు మున్సిపల్ కార్పొరేషన్, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గురువారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. హైకోర్టులో పెండింగ్లో ఉన్న కేసుల కారణంగా గత నెలలో నిలిచిపోయిన 23 పట్టణ స్థానిక సంస్థలకు న్యాయపరమైన అడ్డంకులు తొలగాయి. మరో రెండు వారాల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 26న పోలింగ్, 28న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే మొదటి దశ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన సంగతి తెలిసిందే.

ఎన్నికల జరిగే పట్టణాలు / నగరాలు: రెండో దశలో భాగంగా నాలుగు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. రాజధాని ప్రాంతంలోని కీలకమైన మంగళగిరి – తాడేపల్లి తో పాటు కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం నగరపాలక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు గుడివాడ, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, నరసరావుపేట, పొన్నూరు, శ్రీకాళహస్తి, కావలి, కందుకూరు, గూడూరు, ఆమదాలవలస, రాజాం, తాడిగడప తదితర 19 మున్సిపాలిటీలు / నగర పంచాయతీల్లో ఓటర్లు తమ తీర్పు ఇవ్వనున్నారు. ముఖ్యంగా మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్, గుడివాడ మున్సిపాలిటీ ఎన్నికలు అధికార కూటమికి, ప్రతిపక్ష వైసిపికి ప్రతిష్టాత్మకంగా మారాయి.

కూటమి ముందస్తు సన్నద్ధత..: ఇప్పటికే కూటమిలో పదవుల సర్దుబాటు, మేయర్ అభ్యర్థుల ఖరారు పై స్పష్టత వచ్చింది. అందుకే ఆత్మవిశ్వాసంతో బరిలో దిగుతున్నారు అభ్యర్థులు. ముందస్తు ఒప్పందంలో భాగంగా కాకినాడ, శ్రీకాకుళం కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు మేయర్ పదవులకు పోటీ చేయనుండగా.. రాజమండ్రి కార్పొరేషన్ లో బిజెపి అభ్యర్థి బరిలో నిలవనున్నారు. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ ఆయా సామాజిక వర్గాల వారీగా బలమైన అభ్యర్థులను కూటమి సిద్ధం చేసింది. ఇటీవల జరిగిన 100 పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం చవిచూసింది.

మల్లారెడ్డికి షాక్!

(మొదటి పేజీ తరువాయి)

సినీ సెలబ్రిటీగా మారి..: ఎంపీగా రాజకీయ ప్రవేశం చేసి.. తర్వాత గులాబీ పార్టీలో చేరి మంత్రి అయ్యారు మల్లారెడ్డి. అయితే స్వతహాగా ఆయన పెద్ద విద్యావేత్త. మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత. ఆపై రాజకీయ నాయకుడు. మంత్రిగా కూడా వ్యవహరించారు. ఎంత చేసిన ఆయనకు సెలబ్రిటీ హోదా కల్పించింది మాత్రం సోషల్ మీడియా. అందుకే ఆయన మరింత సెలబ్రిటీగా మారిపోయారు. చివరకు సినీ ప్రముఖులు సైతం ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధపడ్డారు. పరస్పర రాజకీయ, సినీ ప్రయోజనాల కోసం మల్లారెడ్డి విద్యాసంస్థల్లో ఈవెంట్లు పెడితే సూపర్ హిట్ అనే అభిప్రాయం ఏర్పడింది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో కఠిన చట్టాలను అమలు చేయాలని సిఫార్సు చేసింది రాష్ట్ర ఉన్నత విద్యా మండలి. త్వరలోనే రానున్న ఈ నూతన చట్టం లేదా నిబంధనలు విద్యాసంస్థల బాధ్యతారాహిత్యానికి అడ్డుకట్ట వేసే అవకాశం కూడా ఉంది.



ఆ సినిమా ఈవెంట్లలో..

గతంలో మల్లారెడ్డి యూనివర్సిటీలో టాక్షిక్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడ్డాయి. తగిన భద్రతా జాగ్రత్తలు, క్రౌడ్ మేనేజ్మెంట్ నిబంధనలు పాటించకపోవడంతో భారీగా తరలివచ్చిన జన సందోహం వల్ల తొక్కిసలాట జరిగింది. స్పీకర్ల స్టాండ్ కూలి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విద్యాసంస్థలను ఇలాంటి సినిమా ప్రమోషన్లకు అనుమతించడంపై, విద్యార్థుల భద్రతను గాలికి వదిలేయడం పై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. పోలీసులు కేసులు నమోదు చేశారు. మరో ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు, అనుమతులు తీసుకోకుండా రాత్రి వేళలో నిర్వహించిన దాండియా కార్యక్రమంలో లైటింగ్ ఫ్రేమ్ కుప్పకూలిపోయి ఒక విద్యార్థి దుర్మరణం పాలవగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వేలాది మంది హాజరయ్యే కార్యక్రమాలకు స్థానిక పోలీసులు, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖల నుంచి ముందస్తు అనుమతులు పొందకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరుపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యాసంస్థల్లో చట్టపరంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు? వీటిని పూర్తిగా నిషేధించాలి? అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ప్రభుత్వం విద్యాశాఖ అధికారులను ఆదేశించగా ఈ మేరకు.. రాష్ట్ర విద్యా మండలి ఈ మేరకు సిఫార్సు చేసింది. ప్రభుత్వం కఠిన చర్యలకు దిగే అవకాశం ఉంది.



హైదరాబాద్ యూనివర్సిటీలో యూఓహెచ్ ప్రో టీ20 లీగ్ ప్రారంభం...

మ్యాచ్ షెడ్యూల్ విడుదల...



క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: హైదరాబాద్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక యూఓహెచ్ ప్రో టీ20 లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. నిర్వాహకులు మ్యాచ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మ్యాచ్ షెడ్యూల్:

- గురువారం, నవంబర్ 12 – ఉదయం 9 గంటలకు: హైదరాబాద్ యూనివర్సిటీ వర్సెస్ షాదాన్ – తొలి మ్యాచ్
- శనివారం, నవంబర్ 14 – ఉదయం 8 గంటలకు: అరోరా వర్సెస్ మహీంద్రా – రెండో మ్యాచ్
- ఆదివారం, నవంబర్ 15 – ఉదయం 8 గంటలకు: హెచ్‌సీయూ హాక్స్ వర్సెస్ ఎల్లెంకి – మూడో మ్యాచ్
- ఆదివారం, నవంబర్ 15 – మధ్యాహ్నం 1 గంటకు: హైదరాబాద్ యూనివర్సిటీ వర్సెస్ మహీంద్రా – నాలుగో మ్యాచ్.ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధార్థ్.డి మాట్లాడుతూ, యువ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ప్రో టీ20 లీగ్ నిర్వహిస్తున్నామని, అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని కోరారు.
- టోర్నమెంట్‌కు విద్యార్థులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ సింగదాసరి, ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'భారత్ సమ్మిట్'.. నవ్వుల పాలు!

(మొదటి పేజీ తరువాయి)

వేదికగా ఎండగట్టాయి. అయితే ఆ అనుభవం నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా మళ్ళీ అదే తప్పును పునరావృతం చేశారు. పెట్టుబడుల ముసుగు తీసేసి.. అంతర్జాతీయ వ్యవహారాల సదస్సుగానో లేక ప్రజాస్వామ్య సిద్ధాంతాల కాంక్లేవ్ గాను ప్రచారం చేసి ఉంటే ప్రభుత్వానికి ఎంతటి రాజకీయ విమర్శలు వచ్చేవి కావు.. కానీ ప్రపంచ స్థాయి కార్పొరేట్ పెట్టుబడులు రప్పిస్తున్నామంటూ హడావిడి చేసి.. లోపల మాత్రం కాంగ్రెస్ విదేశాంగ సిద్ధాంతాలు, 2029 రాజకీయ లక్ష్యాలపై డిబేట్ లు పెట్టడం పాలనా వర్గాల్లోనూ, పారిశ్రామిక వర్గాల్లోనూ తీవ్ర అసహనానికి దారితీస్తోంది.

ఏదీ ప్రొఫెసనలిజం?

రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే పక్కా ప్రొఫెసనలిజంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ను చూసి నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం విశాఖలో సీఐఐ సహకారంతో పక్క ప్రొఫెషనల్ అజెండాతో దూసుకుపోతున్న కీలక తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి అనవసర రాజకీయ వివాదాల్లో ఇరుక్కోవడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదన్న భావన ఉంది. రాజకీయాలు, పార్టీ భావజాలాలు వేరు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రాణవాయువైన పారిశ్రామిక పెట్టుబడులు వేరు అన్న లక్ష్మణ రేఖను పాలకులు గుర్తించకపోతే ప్రభుత్వ విశ్వసనీయతే దెబ్బతినే అవకాశం ఉంది. భారత్ సమ్మిట్ కు రాజకీయ ముద్ర అంటింది. త్వరలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన అసలైన పారిశ్రామిక వేదికపై ప్రతికూల ప్రభావాన్ని చూపే ప్రమాదం ఏర్పడింది.



మహిళా సాధికారతకు కుట్టు శిక్షణ ఎంతో దోహదం



మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కుట్టు శిక్షణ వంటి వృత్తి నైపుణ్య కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి. కాలనీలో జనని మహిళా మండలి ఆధ్వర్యంలో, అక్షయ శక్తి ఫౌండేషన్ సహకారంతో మహిళా సాధికారత లక్ష్యంగా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద మహిళలకు కుట్టు శిక్షణ అందించడం ద్వారా స్వయంగా ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అక్షయ శక్తి ఫౌండేషన్ సభ్యురాలు వాణి, వీరస్వామి, శివరాం రెడ్డి, జానని మహిళా మండలి సభ్యులు లక్ష్మి, స్వర్ణలత, మహిళా నాయకులు లత శ్రీ, జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, చిన్న, సురేందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులందరికీ సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి



క్రైమ్ మిర్రర్,నాంపల్లి: పాడి రైతులందరికీ ప్రభుత్వమే సబ్సిడీపై పశుగ్రాసం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవక భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వీబీ--జీ రామ్ జీ పథకం ద్వారా ఐదు ఎకరాల్లోపు భూమి కలిగి, బోరుబావులు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పశుగ్రాసం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అర్హులైన పాడి రైతులందరికీ నేరుగా సబ్సిడీ రూపంలో పశుగ్రాసం అందించాలని డిమాండ్ చేశారు. పశువులకు తాగునీటి వసతి కల్పించడంతో పాటు పాడి పశుసంపదను కాపాడేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అయన ప్రభుత్వాలను కోరారు.



అల్లందేవిచెర్వు ప్రజల రేషన్ కష్టాలకు తెర

ఎమ్మెల్యే చొరవతో గ్రామానికి రేషన్ షాపు మంజూరు.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- మునుగోడు నియోజకవర్గంలోని అల్లందేవిచెర్వు గ్రామ ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామానికి నూతన రేషన్ షాపును మంజూరు చేయించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి అల్లందేవిచెర్వు గ్రామ ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో రేషన్ షాపు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, ఇతర లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం సమీపంలోని కోతులాపురం గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. మరికొందరు సర్వేలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి రావడంతో ప్రజలకు ప్రయాణ భారం, సమయ వృథాతో పాటు అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి.ఈ సమస్యను స్థానిక ప్రజల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి అల్లందేవిచెర్వు గ్రామానికి రేషన్ షాపు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అల్లందేవిచెర్వు గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్, మండల నాయకులు సుర్వి చంద్రం, మాజీ వార్డు సభ్యులు గుండు రాజు, విరమల్ల వెంకటేష్ కలిసి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి రేషన్ షాపు మంజూరు చేయించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై గ్రామ ప్రజలకు రేషన్ సరుకులు స్థానికంగానే అందుబాటులోకి రానుండటంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

లార్డ్స్ ఒలింపియాడ్ లో క్రీడోత్సవం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) బడంగ్ పేట్ లోని లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్లో ఉత్సాహంగా క్రీడో కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా ముఖ్య అతిథులుగా లార్డ్స్ పాఠశాలల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి, లార్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్ పాల్గొని విద్యార్థుల ప్రతిభాపాఠవాలు, ప్రారంభ విద్యా ప్రయాణం, అభ్యాస విధానాలను గురించి మాట్లాడారు. అందులో భాగంగా లార్డ్స్ పాఠశాలల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ క్రీడో వల్ల పిల్లలకు మానసిక ఉల్లాసము, సృజనాత్మకత ఆలోచనలకు దారితీస్తాయని అంటూ ప్రస్తావించారు. తదుపరి వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్రీడో యొక్క ఉద్దేశం పిల్లల మానసిక అభివృద్ధిని, ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అందులో భాగంగా డీన్ సతీష్ మాట్లాడుతూ పేరెంట్స్ కి ఈ కార్యక్రమం వల్ల ఎలాంటి లాభాలు ఉంటాయో పేరెంట్స్ కూడా ఏ విధంగా ప్రతిస్పందించాలి అనేది ఈ కార్యక్రమంలో ఆయన చెప్పడం జరిగింది. ఈ విధంగా ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 శుక్రవారం 13-11-2026



ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:– యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గవ్వల నరసింహ కు 60,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరు అయింది. ఈ చెక్కును సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, వార్డు సభ్యులు పందుల యాదగిరి గౌడ్, బల్గూరి శివ, సభావత్ రఘు, నీళ్ల అనిత శంకర్, చింతల శైలజ సత్యనారాయణ, సింగపంగా ప్రశాంతి రమేష్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, సాగర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంట పరిశీలన

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి



క్రైమ్ మిర్రర్ నాంపల్లి: మండలం పరిధిలోని గానుగుపల్లిలో గురువారం వ్యవసాయ విస్తరణ అధికారి వి.పావని పంట నష్టం అంచనా ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గట్లమల్లేపల్లి క్లస్టర్ పరిధిలోని కుందేల్ల తిరుమలగిరి, గానుగుపల్లి, మహమ్మదాపురం, గట్లమల్లేపల్లి గ్రామాల్లో వరి పంట ఎండిపోయిన రైతులు తనకు సమాచారం అందించాలని ఏఈఓ పావని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈదయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కడారి రామకృష్ణ పాల్గొన్నారు.

రామప్ప దేవాలయంను సందర్శించిన అమెరికా దేశస్తుడు



వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 12: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని గురువారం అమెరికా కు చెందిన మార్క్ పెస్కార్ సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్, బద్రు, అరుణ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాటలు కాదు.. చేతల్లో గ్రామాభివృద్ధి కనిపించాలి!





ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం.

కేశంపేట,(క్రైమ్ మిర్రర్):మాటలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.గురువారం మండల పరిధిలోని దేవుని గుడి తండా,రాగ్య తండా,చింతకుంటపల్లి,పాటిగడ్డ, గ్రామాల్లో నూతన రేషన్ దుకాణం,స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ,ఇందిరమ్మ గృహప్రవేశాలు,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు దొడ్డు బియ్యం సరఫరా చేయగా, పేద ప్రజలకు సన్నబియ్యాన్ని అందజేస్తున్న ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాలలో మాలిక సదుపాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే వాటిక అవసరమయ్యే చర్యలు తీసుకోవాలన్నారు.చింతకుంటప ల్లి గ్రామంలో సమాఖ్య భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తెలపగా భవన నిర్మాణం కోసం ఐదు లక్షల నిధులు మంజూరు చేస్తామని, మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన కుర్చీలు,బీరువా,జమఖానాలు అందిస్తానని తెలిపారు. చింతకుంటపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు భూమికి నక్షలేని కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందడంతో ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే కాగానే ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ సర్వేలో భాగంగా మొట్టమొదటగా గ్రామ సర్వే పనులు ప్రారంభించి సర్వే నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాయకులు పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి,ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, తహశీల్దార్ రాజేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్,కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వీరేశ్, ఆయా గ్రామాల సర్పంచులు సురేష్ రెడ్డి, సుజాత, శశిరేఖ,భాస్కర్ గౌడ్,శ్యామల అఖిల్, పోచమోని రమేష్,పల్లె ఆనంద్,నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్,కల్లు సాయిలు,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ జాంగారి రవి, నాయకులు కరుణాకర్ రెడ్డి, మల్లేష్, భీమయ్య, లింగం,శ్రీనాథ్,రమేష్,వంశీ గౌడ్, సుదర్శన్, కృష్ణయ్య,భాస్కర్ నాయక్ సరికొండ రమేష్,యాదగిరి, కోడూరు రాములు,చిర్ర శ్రీను, కోడూరు నరసింహ, మనోహర్ గౌడ్, ప్రకాష్ గౌడ్, అంజయ్య గౌడ్,శ్రీధర్,హరీశ్వర్ రెడ్డి, అంజయ్య, అనసూయ, గుండె రాణి, తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడి గ్రామానికి మెరుగైన విద్యుత్

రూ.2.80 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

లో ఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం..

మూడు గ్రామాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి





కోదాడ, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్): కోదాడ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా మరో కీలక అడుగు పడింది. కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో రూ. 2.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి నలమాద పద్మావతి రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో కూచిపూడి, కాపుగల్లు, యతిరాజాపురం తండా పరిధిలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఆయా గ్రామాల ప్రజలు, రైతులు చాలాకాలంగా ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ సబ్‌స్టేషన్ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం 1,140 గృహ విద్యుత్ కనెక్షన్లు, 1,184 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్ ద్వారా రైతులకు సాగు అవసరాలకు, గ్రామీణ ప్రజలకు గృహ అవసరాలకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని చెప్పారు.ప్రజల అవసరాలను గుర్తించి విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో జీకేఎస్ హాస్పిటల్ ఘన ప్రారంభం...

ముఖ్య అతిథిగా మారబోయిన రవి యాదవ్...



క్రైమ్ మిర్రర్ గచ్చిబౌలి: గచ్చిబౌలి స్ట్రీట్ నంబర్ 3లో నూతనంగా ఏర్పాటు చేసిన జీకేఎస్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ కుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. జీకేఎస్ హాస్పిటల్ మరింత అభివృద్ధి చెంది, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు అండగా శ్రీ గణేష్ యూత్

వివాహ ఖర్చుల కోసం రూ.25,800 ఆర్థిక సాయం

నూతనకల్(క్రైమ్ మిర్రర్): మానవత్వమే మిన్నగా భావించి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే లక్ష్యంగా శ్రీ గణేష్ యూత్ సభ్యులు మరోసారి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. నూతనకల్ గ్రామానికి చెందిన గుండాల లింగయ్య, సరిత దంపతులు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ఇద్దరు కుమార్తెలు గుండాల నికిత, లిఖిత తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యారు. అప్పటి నుంచి వారి నానమ్మే పిల్లలను పెంచి పెద్ద చేసింది. ఈ క్రమంలో ఒక కుమార్తె వివాహం జరుగుతున్న నేపథ్యంలో ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని శ్రీ గణేష్ యూత్ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు యూత్ సభ్యులందరూ కలిసి శ్రీ గణేష్ యూత్ తరఫున రూ.25,800 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తల్లిదండ్రులు లేని ఆడపిల్లల వివాహానికి తమ వంతు సహకారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, సమాజ సేవలో ముందుండే శ్రీ గణేష్ యూత్ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత.. అహింసా జగత్ పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ప్రారంభం

బ్రహ్మర్షి పత్రీజీ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం.. ఆచార్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- బ్రహ్మర్షి పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ మహానగరంలో అహింసా జగత్ పిరమిడ్ ధ్యాన ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఆచార్య శ్రీనివాస్ సారథ్యంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ధ్యాన సాధకులు, ఆధ్యాత్మిక అభిమానులు పాల్గొన్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గుండబోయిన రమేష్ యాదవ్ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలు ఎంతో అవసరమన్నారు. ధ్యానం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని, ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ధ్యానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.బ్రహ్మర్షి పత్రీజీ ధ్యాన సాధన ఆధ్యాత్మిక చైతన్యం, అహింసా భావనలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ధ్యానం, శాకాహారం, అహింస, మానవతా విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ఆశ్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.అహింసా జగత్ పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ద్వారా ధ్యాన సాధనపై ఆసక్తి ఉన్నవారికి ఆధ్యాత్మిక మార్గదర్శనం అందించడంతోపాటు ప్రశాంతమైన జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గుండబోయిన రమేష్ యాదవ్ పాల్గొని ఆశ్రమ ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలిపారు.

లార్డ్స్ హైస్కూల్లో అంకుర్ అనే శీర్షికతో క్రీడో పేరెంట్ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిల్లెలగూడ లార్డ్స్ హైస్కూల్లో చిన్నారుల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని క్రీడో పేరెంట్ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ను 'అంకుర్' అనే విశిష్టమైన శీర్షికతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అంకుర్' అంటే మొలక లేదా చిగురని, చిన్నారులు కూడా మొలకెత్తుతున్న విత్తనాల వంటివారని, వారికి సరైన విద్య, ప్రోత్సాహం, ప్రేమ, మార్గదర్శకత్వం అందిస్తే భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారనే ఉన్నతమైన సందేశంతో ఈ కార్యక్రమానికి 'అంకుర్' అనే పేరును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు క్రీడో ల్యాబ్‌లో నిర్వహించిన వివిధ అభ్యాసాత్మక కార్యకలాపాలను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ, ప్రస్తుత విద్యావిధానంలో పుస్తక పరిజ్ఞానంతో పాటు అనుభవపూర్వక విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. చిన్నారుల అభిరుచులు, ఆసక్తులు, ప్రతిభను చిన్న వయస్సు నుంచే గుర్తించి ప్రోత్సహిం చడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయవచ్చని తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా కీలకమని వివరించారు. వైస్ చైర్మన్ బెర్లూ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు ఆనందంగా నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారిలో సహజమైన ఆసక్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.డైరెక్టర్ సిద్ధాల శ్రీలత మాట్లాడుతూ, క్రీడో విధానం చిన్నారుల అభ్యాస ప్రక్రియను మరింత ఆసక్తికరంగా, ఆహ్లాదకరంగా మారుస్తుందని తెలిపారు. పిల్లలు కేవలం వినడం, చదవడం ద్వారా మాత్రమే కాకుండా, స్వయంగా చేసి చూడటం, అనుభవించడం, ప్రశ్నించడం ద్వారా విషయాలను మరింత సులభంగా అర్థం చేసుకుంటారని వివరించారు. 'అంకుర్' వంటి కార్యక్రమాలు తల్లిదండ్రులకు తమ పిల్లల అభ్యసన పురోగతిని, అంతర్గత ప్రతిభను అర్థం చేసుకునే గొప్ప అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. అకడమిక్స్ డీన్ సతీష్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాథమిక దశలోనే బలమైన అభ్యాస పునాదులు ఏర్పడటం అత్యంత ముఖ్యమని, క్రీడో వంటి వినూత్న బోధనా పద్ధతులు పిల్లల్లో స్వతంత్ర ఆలోచనలను, పరిశోధనా దృక్పథాన్ని, నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందిస్తాయని వివరించారు. అకడమిక్స్ కోఆర్డినేటర్ శారద మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయుల ప్రణాళికాబద్ధమైన కృషి, చిన్నారుల సాధన, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణాలని పేర్కొన్నా రు. ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుం దని, దానిని గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఎల్. మారియన్ మాట్లాడుతూ, విద్య అనేది కేవలం మార్కులు, పరీక్షలు, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదని, ప్రతి చిన్నారిలోని సహజమైన సామర్థ్యాలను వెలికితీసి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలని అన్నారు. పిల్లల జీవితంలో తొలి విద్యా దశ ఎంతో కీలకమని, ఈ దశలో అందించే అనుభవాలు వారి భవిష్యత్తు అభ్యాసానికి పునాదులుగా నిలుస్తాయని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడుపుతూ, వారి ప్రతి చిన్న విజయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి లభించిన విశేష స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

వసతీగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్


పాఠ్యాంశాల్లో ప్రావీణ్యం పెంపొందించుకొని, క్రీడల వైపు మొగ్గు చూపాలి

విధుల్లో లేని వార్డెన్ కు మెమో జారీ చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్.



భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 12 : వసతీగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం బూర్గంపాడు మండలంలోని లక్ష్మీపురం నందుగల మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల (బాలుర) గురుకుల పాఠశాల మరియు కళాశాల – భద్రాచలం వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో 420 విద్యార్థులు ఉండగా.. 320 మంది పాఠశాల విద్యార్థులు, 100 మంది కళాశాల విద్యార్థులకు అందిస్తున్న వసతులను, భోజన ఏర్పాట్లను, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసే డైనింగ్ హాలును పరిశీలించి,అక్కడే ఉన్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి భోజనం పెడుతున్నారా అనే వివరాలను హెల్త్ సూపర్వైజర్ సాయి ప్రియ, హిందీ ఉపాధ్యాయులు శైలజ,పీఈటీ భాస్కర్ లను నుంచి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించే విధానం, వంటశాలలో పాటిస్తున్న పరిశుభ్రత, వంటకు ఉపయోగిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు.అనంతరం స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి నిల్వ ఉంచిన కాయకురాలు, బియ్యం, ఇతర నిత్యావసర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాలను ఎంతకాలం నిల్వ ఉంచుతున్నారు, వాటి నాణ్యతను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారు అనే విషయాలను సంబంధిత సిబ్బందిని నుంచి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం అందిస్తున్న స్నాక్స్ వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ సమతుల్యమైన, పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు.ఈ క్రమంలో విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలను, స్టోర్ రూమ్ ను తనిఖీ చేసి స్టాక్ బుక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వంటశాల పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వ గదులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు తాజా కాయకురాలు, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలను అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వంట చేసే సమయంలోనూ, భోజనం వడ్డించే సమయంలోనూ పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా, ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆర్ఓ ప్లాంట్ పనితీరుపై ఆరాతీశారు. విద్యార్థులకు నిరంతరం శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందించే ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని, పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా పాఠశాల, కళాశాల పిఈటిలతో సంప్రదించి రాణించాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. అనంతరం వసతి గృహంలో వార్డెన్ విధుల్లో లేకపోవడంతో తక్షణమే మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్, లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

విద్యార్థుల మూత్రశాలలనిర్మాణంలో మార్పులు చేయాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నిరుపయోగంగా ఉన్న డైనింగ్ హాల్ వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



ఎల్బీనగర్ నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్): హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న మూత్రశాలలను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్థానిక బస్తీవాసులతో కలిసి పరిశీలించారు. పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని మూత్రశాలలు నిర్మిస్తుండటంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు.దీంతో చుట్టుపక్కల నివాసప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించిప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నిర్మాణ స్థలాన్ని మార్చాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పెద్ద సంఖ్య లో విద్యార్థులు చదువు తున్న పాఠశాలలో మూత్రశాలలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.అయితే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండానిర్మాణంలో తగిన మార్పులు చేయాలని సూచించారు.మూత్రశాలల నిర్మాణాన్ని పాఠశాల ప్రహరీ గోడ నుంచిఐదు అడుగుల లోపలికి జరిపి చేపట్టాలని,దుర్వాసన బయటకు వ్యాపించకుండా ఎగ్జీస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలనిఆదేశించారు.ప్రభుత్వం ప్రతి నెలా నిర్వహణ కోసం అందించే నిధులతో మూత్రశాలలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.

నిరుపయోగంగా ఉన్న డైనింగ్ హాల్‌కు మహర్దశ

అనంతరం పాఠశాల ప్రాంగణంలో కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్వహణ లోపంతో హాల్ చెత్తాచెదారంతో నిండిపోయి వినియోగానికి నోచుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాతల సహకారంతో డైనింగ్ హాల్‌లో ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టి, అవసరమైన బండలు వేయించి తిరిగి వినియోగంలోకితీసుకువస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వంటశాలను కూడా డైనింగ్ హాల్‌లోకి మార్చి విద్యార్థులకు ఉపయోగపడేలాచర్యలు తీసుకుంటామని వెల్లడించారు.విద్యార్థులకు మెరుగైన మౌలికసదుపాయాలు కల్పించడంతో పాటు, పాఠశాల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి,డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడుచెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్ సాగర్, దీపావళిశ్రవణ్, నక్కదర్శన్, రాకేష్,సందీప్,మధు, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

నాలుగు ట్రాక్టర్లు సీజ్.. యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు

నూతనకల్ (క్రైమ్ మిర్రర్) : మండల పరిధిలోని మాచినపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించేందుకు ప్రయత్నించిన నాలుగు ట్రాక్టర్లను నూతనకల్ పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మాచినపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్లు తిరుమలాయపాలెం మండలం ముజాయిదిపురం గ్రామానికి చెందినవిగా గుర్తించారు. ఈ ఘటనపై వాహన యజమానులు, డ్రైవర్లపై ఇసుక దొంగతనానికి సంబంధించిన చట్టపరమైన సెక్షన్లతో పాటు ప్రజా ఆస్తుల నష్టం నివారణ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెందిన సహజ వనరులను అక్రమంగా తరలించడం, ఇసుక దొంగతనాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

కూలి రేట్లు పెంచాలి..

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

నవంబర్ 15న నల్గొండలో జరిగే కిసాన్ సభ బహిరంగ సభను జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ మాట్లాడుతూ.. ఉత్పత్తిని సృష్టిస్తున్న శ్రామిక వర్గానికి అన్యాయం చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్నా నేటికీ కూలి పనులు కల్పించాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని పేదలు అడుక్కునే దుస్థితి కొనసాగుతోందని, ఇందుకు పాలకుల విధానాలే కారణమని అన్నారు. దేశంలో 90 శాతం ఉన్న కార్మిక, కర్షకుల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వాలు, కేవలం 10 శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి పేదవాడికి భూమి ఉండాలని, చేతినిండా పని దొరకాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లాలో అనేక మంది పెత్తందారులు మిగులు భూములను ఆక్రమించుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలు గుడిసెలు వేసుకునేందుకు స్థలం అడిగితే ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో అఖిల భారత కిసాన్ సభ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 15న జరిగే బహిరంగ సభకు సంగారెడ్డి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రామచందర్, కార్యదర్శి ఎం. నర్సింహులు, టి.ఏ. శోభు, చంద్రన్న, దశరథ్, శేఖర్, నర్సింలు, రాజు, కుమార్, వినోద, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శుక్రవారం 13-11-2026

పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయం తరలింపుపై భగ్గుమన్న నిరసన గళం

- తరలింపు ప్రతిపాదనను వ్యతిరేకించిన ఎంపీ రఘునందన్ రావు
- ఖాజాగూడకు తరలిస్తే కార్మికులకు ఇబ్బందులు
- కర్దానూర్‌లో ప్రభుత్వ స్థలం కేటాయించేలా చర్యలకు ఎంపీ హామీ
- పటాన్‌చెరులోనే పీఎఫ్ కార్యాలయం కొనసాగించాలి
- కార్యాలయాన్ని తరలిస్తే పోరాటం తప్పదు, కార్మికుల పక్షాన పోరాటం
- సొంత భవనం నిర్మించాలని సిఐటియు డిమాండ్
- పారిశ్రామిక ప్రాంత కార్మికుల ప్రయోజనాలు కాపాడాలి
- ప్రభుత్వం తరలింపు ఆలోచన విరమించుకోవాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు అతిమేల మానిక్ హెచ్చరిక



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: పటాన్‌చెరులో కొనసాగుతున్న ఉద్యోగుల భవిష్య నిధి అయిన పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఖాజాగూడకు తరలించాలనే ప్రతిపాదనపై నిరసన గళం వినిపిస్తోంది. పీఎఫ్ కార్యాలయాన్ని పటాన్‌చెరు నుంచి తరలించవద్దంటూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, సిఐటియు నాయకులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

కార్యాలయం ఇక్కడే కొనసాగాలి.. ఎంపీ రఘునందన్ రావు

పటాన్‌చెరులో కొనసాగుతున్న పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఖాజాగూడకు తరలించే ప్రతిపాదనను ఎంపీ మాధవనేని రఘునందన్ రావు తీవ్రంగా వ్యతిరేకించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఈ ప్రాంతానికి చెందిన 200 మందికి పైగా సబ్‌స్క్రైబర్లకు పీఎఫ్ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యాలయాన్ని దూర ప్రాంతానికి తరలిస్తే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులకు వివరించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమావేశమైన ఎంపీ, పీఎఫ్ కార్యాలయాన్ని పటాన్‌చెరులోనే కొనసాగించాలని సూచించారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన స్థలాన్ని కర్దానూర్ వద్ద ఏర్పాటు చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పటాన్‌చెరు బస్టాండ్‌పై నిరుపయోగంగా ఉన్న మొదటి, రెండవ అంతస్తులను పరిశీలించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో పటాన్‌చెరు నుంచే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీ తెలిపారు.

తరలిస్తే ప్రతిఘటన తప్పదు.. సిఐటియు హెచ్చరిక

పీఎఫ్ కార్యాలయాన్ని పటాన్‌చెరు నుంచి ఖాజాగూడకు తరలించాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. కార్యాలయాన్ని తరలిస్తే కార్మికుల పక్షాన ప్రతిఘటన తప్పదని పత్రికా ప్రకటనలో హెచ్చరించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకటిగా పేరుగాంచిందని, పాశమైలారం, రామచంద్రాపురం, జిన్నారం, కాజిపల్లి, బొల్లారం, బొంతపల్లి, గుమ్మడిదల, గడ్డపోతారం, సుల్తాన్‌పూర్, సంగారెడ్డి, సదాశివపేట, హత్నూర, కొండాపూర్, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో వందలాది పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇంతటి విస్తారమైన పారిశ్రామిక ప్రాంతానికి సేవలందిస్తున్న పీఎఫ్ కార్యాలయాన్ని ఖాజాగూడకు తరలించడం కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. పటాన్‌చెరు, ఇస్నాపూర్, కర్దానూర్ లేదా పాశమైలారం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం కేటాయించి పీఎఫ్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యాలయ తరలింపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని అతిమేల మానిక్ హెచ్చరించారు.



హైదరాబాద్ యూనివర్సిటీలో యూఓహెచ్ ప్రో టీ20 లీగ్..

మ్యాచ్ షెడ్యూల్ విడుదల....

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: హైదరాబాద్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక యూఓహెచ్ ప్రో టీ20 లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు టోర్నమెంట్ మ్యాచ్ షెడ్యూల్ ను నిర్వాహకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గురువారం, నవంబర్ 12వ తేదీ ఉదయం 9 గంటలకులి హైదరాబాద్ యూనివర్సిటీ వర్సెస్ షాదాన్ జట్ల మధ్య తొలి మ్యాచ్ తో లీగ్ ప్రారంభం అయింది.శనివారం, 14వ తేదీ ఉదయం 8 గంటలకు అరోరా వర్సెస్ మహీంద్రా జట్ల మధ్య రెండో మ్యాచ్ జరుగనుంది.ఆదివారం, నవంబర్ 15వ తేదీ ఉదయం 8 గంటలకులి హెచ్ సీయూ హాక్స్ వర్సెస్ ఎల్లెంకి జట్ల మధ్య మూడో మ్యాచ్, అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ యూనివర్సిటీ వర్సెస్ మహీంద్రా జట్ల మధ్య నాలుగో మ్యాచ్ జరుగనుంది.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధార్థ్.డి మాట్లాడుతూ... యువ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ప్రో టీ20 లీగ్ నిర్వహిస్తున్నామని, అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని కోరారు.ఈ టోర్నమెంట్ కు విద్యార్థులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ సింగదాసరి, ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన కొలను శంకర్ రెడ్డి



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిల్లేలగూడ దాతు నగర్ మీదుగా నేతజి సుభాష్ చంద్రబోస్ బీడీఎల్ రోడ్ వరకు 16.50 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను బిజెపి నాయకులతో కలిసి పరిశీలించిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కొలను శంకర్ రెడ్డి. పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డల సిఫారసుతో 16.50 లక్షల నిధులు మంజూరు అయ్యావని కొలను శంకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు సత్యప్రకాష్ సింగ్, దామోదర్ రెడ్డి, జయకాంత, గంగారాం చిన్న సురేష్, పెద్ద సురేష్ సింగ్, విజయ్ జీ, మేడిశెట్టి కృష్ణ, శశిధర్,సశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రాచకొండ చారిత్రక వైభవాన్ని వివరిస్తున సురపెల్లి వెంకటేష్

ప్రాచీన కట్టడాలు.. అద్భుత శిల్పకళా సంపదపై అవగాహన

చారిత్రక వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి



క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- తెలంగాణ చరిత్రలో విశిష్ట స్థానం కలిగిన రాచకొండ కోట ఘనమైన చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని రాచప్ప సమితి సభ్యుడు సురపెల్లి వెంకటేష్ అన్నారు. రాచకొండను సందర్శించిన కలెక్టర్‌కు కోటలోని ప్రాచీన కట్టడాలు, రాతి నిర్మాణాలు, పురాతన ద్వారాలు, ఆనాటి రాజుల పాలనా విధానాలు, రక్షణ వ్యవస్థకు సంబంధించిన చారిత్రక విశేషాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాచకొండ కోటకు ఉన్న శతాబ్దాల చరిత్రను, నాటి పాలకుల పరిపాలనా దక్షతను, యుద్ధ వ్యూహాలను తెలియజేస్తూ అక్కడి శిలా నిర్మాణాల ప్రత్యేకతను వివరించారు. కొండల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన రాతి నిర్మాణాలు, భారీ బండరాళ్లతో రూపొందించిన కోట ద్వారాలు ఆనాటి నిర్మాణ నైపుణ్యానికి, శిల్పకళా వైభవానికి అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు.రాచకొండ కేవలం పర్యాటక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ చారిత్రక సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దమని అన్నారు. ఇలాంటి అపురూపమైన చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. రాచకొండ చారిత్రక ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.రాచకొండ చరిత్ర, ప్రాచీన కట్టడాల విశిష్టతను కలెక్టర్‌కు వివరించిన సురపెల్లి వెంకటేష్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.


సోనియా గాంధీ ఆత్మకథ ఆధారంగా సినిమా నిర్మిస్తా

వచ్చే ఏడాది డిసెంబర్ 9న సినిమా విడుదలే లక్ష్యం

సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌తో చర్చిస్తా

గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి ప్రెస్ మీట్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రయాణం, ఆమె రాజకీయ ప్రస్థానం, త్యాగాలు, ప్రజాసేవను భావితరాలకు తెలియజేసేలా ఆమె ఆత్మకథ ఆధారంగా సినిమా నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి ప్రకటించారు. గురువారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది డిసెంబర్ 9 నాటికి సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సినిమా నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తనకు సన్నిహితంగా ఉన్న మంత్రులతో చర్చిస్తానని వెల్లడించారు. సినిమాలో తన నిజ జీవిత పాత్ర కూడా ఐదు నిమిషాల పాటు ఉంటుందని చెప్పారు. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడు తండ్రి మరణిస్తే ఆ తల్లి పడే కష్టాలు ఎలా ఉంటాయో తనకు తెలుసని, తన తల్లి జీవితాన్ని చూసి ఆ బాధను అర్థం చేసుకున్నానని జగ్గారెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. సోనియా గాంధీ తన జీవిత ప్రయాణాన్ని పుస్తకంలో ఆవిష్కరించారని, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల ఆదర్శాలను దృష్టిలో పెట్టుకుని పార్టీని నడిపిస్తూ ప్రజాసేవ చేసిన చరిత్ర ఆమెదని కొనియాడారు. మూడు సార్లు ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినప్పటికీ సోనియా గాంధీ ఆ పదవిని తిరస్కరించారని, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లను ప్రధానమంత్రులుగా చేశారని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ముఖ్యమంత్రులు కావడంలోనూ సోనియా గాంధీ పాత్ర ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ గురించి తెలంగాణ ప్రజలే గొప్పగా చెప్పుకోవాలని, ఆమె తెలంగాణ ఇచ్చిన విషయాన్ని తన పుస్తకంలో రాసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రతి మహిళను తల్లిగా భావించాలని ప్రసంగించే ఆర్ఎస్ఎస్ నేతలు సోనియా గాంధీని మాత్రం విమర్శించడం ఏమిటని నిలదీశారు. ఇదేనా వారి సిద్ధాంతమని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నేతలకు ఈ మాత్రం ఆలోచన లేదా అని వ్యాఖ్యానించారు. మంచి కుటుంబ నేపథ్యం ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్ ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. కంగనా రనౌత్ నాయకురాలు కాదని, ఆమె ఒక నటి మాత్రమేనని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.



దళితులను కించపరిస్తే సహించేది లేదు

పెద్దపెల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ నవంబర్ 14 న్యూస్: దళితులను కులం పేరుతో కించపరిస్తే సహించేది లేదని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు.కులం పేరుతో దళితులను అవమానించడం, కించపరచడం హేయమైన చర్య అని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్ర మొగిలి,దళిత సంఘాల సీనియర్ నాయకుడు చిప్పకుర్తి సత్యనారాయణ అన్నారు.గురువారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడారు.రాజకీయంగా దళితులు ఎదుగుతున్న సమయంలో వారిని లక్ష్యంగా చేసుకుని అవమానాలకు గురిచేయడం సరికాదన్నారు.ఇటీవల వివిధ ప్రాంతాల్లో దళిత సర్పంచులు,ప్రజాప్రతినిధులపై జరుగుతున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.కులం పేరుతో దూషించే వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సామాజిక మాధ్యమాల్లో దళితులను కించపరుస్తూ వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులను గుర్తించి అరెస్టు చేయాలని కోరారు.దళితులు చిన్న తప్పు చేసినా వెంటనే చర్యలు తీసుకునే యంత్రాంగం,దళితులను అవమానించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో దళితులపై వివక్ష,అవమానకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం,పోలీసు యంత్రాంగం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలను ఇకపై సహించబోమని,న్యాయం జరిగే వరకు మాల,మాదిగ సహా అన్ని దళిత సంఘాలు ఐక్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తాయని హెచ్చరించారు.అవసరమైతే రాజకీయ బహిష్కరణకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు,పులిపాక బొందియాలు,పిల్లి నరసింగం,పొట్ల శంకర్,చిప్పకుర్తి శివలింగం,ఈదునూరి సురేష్,ఆరెల్లి రాజు,ఆవునూరి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



వెల్జాల్ రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ల పంపిణీ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ ఏడీఏ హిమబిందు రెడ్డి మాట్లాడుతూ.. తలకొండపల్లి మండలానికి మొత్తం 120 స్ప్రింక్లర్ సెట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 90 మంది రైతులకు పరికరాలను అందజేసినట్లు తెలిపారు. వెల్జాల్ మాజీ ఎంపీటీసీ అంబాజీ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు స్ప్రింక్లర్ పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. నియోజకవర్గంలోని రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ అవసరాలను గుర్తించి సబ్సిడీపై స్ప్రింక్లర్ పరికరాలు అందేలా సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వెల్జాల్ గ్రామ రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబాజీ, సీనియర్ నాయకుడు అశోక్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ నర్సింహ, మైనార్టీ అధ్యక్షుడు ఆరిఫ్, ఏ. వెంకట్ రెడ్డి, తిరుపతి రెడ్డి, నాని, జగదీశ్వర్ రెడ్డి, విష్ణు, శీను, గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలి : కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 12: గోదావరి పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి, అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయం లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్ల అభివృద్ధి తదితర అంశాలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భక్తులకు వసతి, భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట ఐటీసీ వంటి సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల సహకారాన్ని పరిశీలించాలని సూచించారు.భద్రాచలం ఆలయానికి చేరుకునే రహదారుల అభివృద్ధికి సంబంధించి వంతెన నుంచి ఆలయం వరకు సుమారు రూ. 14 కోట్లతో, బండ్ నుంచి ఆలయం వైపు సుమారు రూ. 2.60 కోట్లతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రహదారుల అభివృద్ధి పనుల విషయంలో రోడ్లు, భవనాల శాఖ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హోమ్ రహదారుల మరమ్మతులు, ఒప్పందాలకు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించి రహదారులపై ప్రయాణం సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ భద్రాచలం పరిధిలో గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు, ప్రస్తుతం ఉన్న ఘాట్ల మరమ్మతులు, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, సురక్షితంగా స్నానాలు ఆచరించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి వివరించారు. ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కొత్త ఘాట్ల నిర్మాణంతో పాటు ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దుమ్ముగూడెం ఘాట్ మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదించిన పనులను వేగవంతం చేయాలని, బూర్గంపాడు మండలం మోతే వద్ద వీఐపీ ఘాట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. సారపాకలోని పుష్కరవనం పరిధిలో ఉన్న సుమారు 75 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, అక్కడి చెట్లకు నష్టం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లకు అనువైన ప్రణాళిక రూపొందించాలన్నారు. అవసరమైతే సమీపంలోని అటవీ శాఖకు చెందిన యూకలిప్టస్ ప్లాంటేషన్, ఇతర ప్రభుత్వ భూములు, ప్రైవేటు వ్యవసాయ భూములను కూడా పరిశీలించాలని సూచించారు. గుర్తించిన స్థలాలు సరిపోకపోతే అదనంగా మరో 30 ఎకరాల వరకు అనువైన భూమిని గుర్తించడంతో పాటు సుమారు 10 ఎకరాలను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రైవేటు భూములను పార్కింగ్ లేదా ఇతర అవసరాలకు వినియోగించాల్సి వస్తే రైతులతో ముందుగానే చర్చించి, పంట నష్టం, భూమి వినియోగానికి సంబంధించిన పరిహారంపై స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చివరి నిమిషంలో భూ వివాదాలు తలెత్తకుండా కనీసం ఆరు నెలల ముందుగానే రైతులతో సంప్రదింపులు జరపాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పార్కింగ్, హోల్డింగ్ ఏరియాలకు అనువైన స్థలాలను పరిశీలించాలని ఆదేశించారు.

భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక. : ఎస్పీ రోహిత్ రాజు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భద్రాచలం వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. వాహనాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా నిర్ధారించడంతో పాటు పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించి ట్రాఫిక్ నిర్వహణ చేపడతామన్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, పార్కింగ్ ప్రాంతాల్లో సూచిక బోర్డులు, రేడియం, ఎల్ఈడీ బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లోనూ రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల భద్రత, రద్దీ నియంత్రణకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పిస్తూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.

పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో అనుసరించిన విధానాన్ని పరిగణనలోకి తీసుకొని క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు తాగునీటి సరఫరా, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్ల వద్ద, క్యూలైన్లలో తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేయాలని, ప్రసాదం కౌంటర్లు, ఫుడ్ కోర్టులు, అన్నదాన కేంద్రాలకు అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా భద్రాచలం, పర్ణశాల ప్రాంతాల్లో తాత్కాలిక ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించి, తగిన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్‌లతో కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలు, ఇతర తాత్కాలిక సదుపాయాల ఏర్పాటుకు వాటర్‌ప్రూఫ్ టెంట్లను వినియోగించాలని సూచించారు.

ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకల మార్గాలు, శానిటరీ కాంప్లెక్స్‌ల వద్ద నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. చెత్త తొలగింపు, మరుగుదొడ్ల శుభ్రత, తాగునీటి సరఫరా నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. పుష్కరాల సమయంలో భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించేందుకు గెస్ట్‌హౌస్‌లను గుర్తించాలని, వీఐపీల వసతి, వాహనాల కాన్వాయ్ పార్కింగ్, పరిసరాల అభివృద్ధి, ల్యాండ్‌స్కేపింగ్ పనులపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

పుష్కరాల సందర్భంగా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా అటవీ ప్రాంతాల్లో పర్యాటక కాటేజీలు, క్యాంపింగ్ సదుపాయాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల పర్యాటకులకు అదనపు సదుపాయాలు కల్పించడంతో పాటు పర్యాటక ఆదాయం పెంపునకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని, కేవలం ప్రాథమిక అంచనాలతో కాకుండా అవసరమైన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని వివరణాత్మక ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కన్సల్టెంట్ ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని, తాత్కాలిక సదుపాయాల ఏర్పాట్లకు సంబంధించి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిపాదనలను ఉన్నతస్థాయిలో సమర్పించి అవసరమైన ఆమోదాలు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పుష్కరాల ఏర్పాట్లలో ఏ శాఖకు సంబంధించిన పనులైనా పరస్పర సమన్వయంతో పూర్తి చేయాలని, సమావేశాల్లో ఒకరిపై మరొకరు బాధ్యతలు నెట్టివేయకుండా సమస్యలను సబ్ కలెక్టర్ లేదా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి అన్ని అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పూర్తయ్యేలా అధికారులు నిర్దిష్ట గడువులతో పనిచేయాలని ఆదేశించారు.



బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎర్రోళ్ల రాజ్ కుమార్

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : చేవెళ్లనియోజకవర్గం శంకర్ పల్లి మండలం సింగపూరం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజ్‌కుమార్‌కు భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం లభించింది. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ నియామక పత్రాన్ని అందజేశారు. రంగారెడ్డి రూరల్ జిల్లా, చేవెళ్లకు చెందిన రాజ్‌కుమార్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, అంకితభావంతో, నిబద్ధతతో తన ప్రాంతంలో, రాష్ట్రంలో పార్టీ అభివృద్ధి, విస్తరణ కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలని, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుల నుంచి కాలానుగుణంగా వచ్చే సూచనలు, ఆదేశాలను పాటించాలని నియామక పత్రంలో సూచించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌కు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఎస్సీ వర్గాల అభివృద్ధి కోసం, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని రాజ్‌కుమార్ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

ట్రాక్టర్ సీజ్.. డ్రైవర్‌పై కేసు నమోదు



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబరు 12: అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున రూరల్ ఎస్ఐ ఉప్పు నగేష్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కామేపల్లిగూడెం శివారులోని మూసీ నది నుంచి మిర్యాలగూడ వైపు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నారు.ట్రాక్టర్ డ్రైవర్, యజమాని అయిన తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గాదె రవిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ నగేష్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిని బైండోవర్ చేస్తామని స్పష్టం చేశారు.

దీపావళి బాంబుల విషయంలో వివాదం.. దళిత యువకుడిపై దాడి!



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబర్ 12: దీపావళి పండుగ సందర్భంగా భారీ శబ్దాలతో కూడిన బాంబులు కాల్చవద్దని చెప్పినందుకు ఓ దళిత యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని దళిత ఐక్య సంఘాల వేదిక నాయకులు ఆరోపించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు శరాబు జగదీష్, ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, పనివారు కలిసి దైద సత్యం ఇంటిపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనలో సత్యం కుమారుడి తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.ఈ మేరకు గురువారం మిర్యాలగూడ డీఎస్పీ రవిని కలిసి నాయకులు ఫిర్యాదు చేశారు. దీపావళి రోజున భారీ బాంబులు కాల్చడాన్ని అభ్యంతరం చెప్పినందుకే కక్ష పెంచుకుని దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత నేత డాక్టర్ జె.రాజు, మాల మహానాడు నాయకుడు తాళ్లపల్లి రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, కేవీపీఎస్ నాయకుడు రేమిడాల పరశురాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు మచ్చ ఏడుకొండలు, మాడ్గుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీకి నూతన కోర్ కమిటీ ఎన్నిక

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎంపిక..

సెక్రటరీగా పాస్టర్ జోసఫ్ రాజు నియామకం

కోదాడ, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్): కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన పాస్టర్స్ కమిటీ అధ్యక్షులు, ప్రతినిధులు, వివిధ మండలాల కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీని మరింత బలోపేతం చేస్తూ నూతన కోర్ కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గ కమిటీలో కొంతకాలంగా ఖాళీగా ఉన్న సెక్రటరీ పోస్టును కూడా ఈ సమావేశంలో భర్తీ చేశారు. సెక్రటరీగా పాస్టర్ జోసఫ్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కోర్ కమిటీ వివరాలు:

కమిటీ చైర్మన్: రెవ. డా. వి. యెషయా
వర్కింగ్ చైర్మన్: యేసు పాదం (చిలుకూరు)
చీఫ్ కోఆర్డినేటర్: పాస్టర్ ప్రసాద్ (కాపుగల్లు)
చీఫ్ ఆర్గనైజర్: పాస్టర్ యేసు రత్నం (నడిగూడెం)
సెక్రటరీ: పాస్టర్ జోసఫ్ రాజు

నూతనంగా ఎన్నికైన కోర్ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా పాస్టర్లు, సేవకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ప్రార్థనాపూర్వకంగా ఆశీర్వదించి, దేవుని సేవలో ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో క్రైస్తవ సమాజ ఐక్యత, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు, పరస్పర సహకారం మరింత విస్తరించేలా నూతన కమిటీ కృషి చేయాలని సమావేశంలో ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ అధ్యక్షులు బ్రదర్ రామారావు, వర్కింగ్ అధ్యక్షులు పాస్టర్ రమేష్, ట్రెజరర్ పాస్టర్ పాల్ చారి, చిలుకూరు మండల అధ్యక్షులు అబ్రహం, అనంతగిరి మండల అధ్యక్షులు పాస్టర్ రాజేష్, మోతే మండల అధ్యక్షులు పాస్టర్ లాజరస్, మునగాల మండల అధ్యక్షులు పాస్టర్ సిలువ రాజు, నడిగూడెం మండల అధ్యక్షులు పాస్టర్ గాబ్రియేల్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ ప్రభుదాస్‌తో పాటు వివిధ మండలాల కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.దేవుని నామములో నూతన కమిటీ మరింత బలంగా పనిచేస్తూ, సమాజ సేవలో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారంతా ఆకాంక్షించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం

కోదాడ 24వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

కోదాడ నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



కోదాడ, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్): పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి నలమాద పద్మావతి రెడ్డి తెలిపారు. కోదాడ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాల కోసం ప్రభుత్వం మొత్తం 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని వెల్లడించారు.కోదాడ పట్టణంలోని 24వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం ఎన్నో ఏళ్లుగా కంటున్న కల అని, ఆ కలను నిజం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు సొంతింటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.కోదాడ నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాతో పాటు సామాజిక గౌరవం, భద్రత కలుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శుక్రవారం 13-11-2026



పేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్న పాపిశెట్టి రాము

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ): వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన జల్లెల మణెమ్మ, శ్రీనివాస్ దంపతుల కుమార్తె మేఘన వివాహానికి ప్రముఖ సంఘసేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆర్థిక సహాయం అందజేశారు. పేదింటి ఆడబిడ్డ వివాహానికి తన వంతు సహకారం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు అండగా నిలవడం సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.వివాహానికి ఆర్థిక సహాయం అందించిన పాపిశెట్టి రాముకు మణెమ్మ, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మేఘన వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని పలువురు ఆకాంక్షించార...

ముచ్చింతల్ సమీపంలో శేఖర్ మాస్టర్ కారు ప్రమాదం..

తృటిలో తప్పిన పెను ప్రమాదం





గండిపేటక్రైమ్ మిర్రర్: సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ముచ్చింతల్‌లో జరుగుతున్న మెగాస్టార్ చిరంజీవి సినిమా షూటింగ్ ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో ముచ్చింతల్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారును వేగంగా వచ్చిన ఓ వ్యాన్ ఢీకొట్టింది. వ్యాన్ ఢీకొట్టడంతో కారు తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రమాదంలో శేఖర్ మాస్టర్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న వారందరూ అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని శేఖర్ మాస్టర్ వెల్లడించింది. ప్రమాదంలో కారు దెబ్బతిన్నప్పటికీ ప్రాణాపాయం తప్పడంతో ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

పీజేటీఎస్‌ఏయూలో నవంబర్ 14న చివరి మాప్‌అప్ కౌన్సెలింగ్

బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏర్పాట్లు

గండిపేటక్రైమ్ మిర్రర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల్లో బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో రెగ్యులర్ కోటాలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 14వ తేదీ శనివారం చివరి మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీహెచ్. విద్యాసాగర్ వెల్లడించారు. శనివారం ఉదయం రెగ్యులర్ కోటాలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చివరి విడత మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. వ్యవసాయ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మిగిలిన సీట్లలో ప్రవేశం పొందేందుకు ఇది చివరి అవకాశం కావడంతో అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, ఇతర మార్గదర్శకాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం www.pjtau.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

బీఆర్ఎస్ చేసిన అప్పులు, ఎల్‌నినో వల్ల తిప్పలు ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు ఆగవు

వచ్చే దీపావళి నాటికి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పూర్తి

ఇందిరమ్మ ఇళ్లు పొందిన ఆడబిడ్డల కళ్లల్లో ఆనందబాష్పాలే మాకు ఆశీస్సులు

మైలార్‌దేవ్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి






గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు మా నెత్తిన పెట్టి పోయినా, ఎల్‌నినో వంటి ప్రకృతి విపత్తులు వచ్చినా ఈ పథకం ఆగదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నిరుపేదల ఆత్మగౌరవమే ఆలంబనగా క్యూర్ పరిధిలోని కోట్లాది రూపాయిల విలువచేసే ప్రాంతాల్లో శంకుస్థాపనలు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను వచ్చే దీపావళి కల్లా పూర్తి చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారులు ఆ ఇళ్లలో దీపావళి జరుపుకోవాలన్నలక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. గురువారం రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారుల కోసం మైలార్‌దేవ్‌పల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యేప్రకాష్‌గౌడ్‌తో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి మాట్లాడుతూ పేదవాడి జీవితాశయమైన సొంత ఇంటిని ప్రభుత్వం ఇస్తుందని మరో మూడు విడతలు ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా, కులమతాలు, పార్టీల బేధాలు లేకుండా కేటాయింపు జరుగుతోందని అన్నారు. ప్రస్తుతం ఇళ్లు పొందిన లబ్ధిదారులు కంట ఆనందబాష్పాలు చూస్తుంటే ఈ ప్రభుత్వానికి, తమకు ఇంతకంటే ఇంకేం కావాలనిపిస్తుందని, వారి స్పందన చూస్తే తమకు కూడా కళ్లు చెమరుస్తున్నాయని అన్నారు. వారి ఆనందభాష్పాలే తమకు ఆశీస్సులని అన్నారు. గత పాలకులు పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో సొల్లుపురాణం చెప్పారని, ఇప్పుడు కూడా ఇళ్ల నిర్మాణం, ఫోర్త్ సిటీ(ఫ్యూచర్‌సిటీ) విషయంలో అవాకులు చవాకులు చెబుతున్నారని ఆరోపించారు. ఏది ఏమైనా ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చి ఆరు ప్రధాన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ నెల 19 నుంచి నాణ్యమైన చిలకాకుపచ్చ రంగు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇక్కడ నిర్మించే ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులెంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. తొలుత కవిత రాథోడ్ అనే మహిళకు సి--బ్లాక్‌లో 603 ప్లాట్ మంజూరు కాగా మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు కలిసి ఆమెకు సర్టిపికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, గృహనిర్మాణశాఖ ఎండీ వి.పి.గౌతమ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మాజీ మేయర్ పారిజాతం ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే.. మురికి నీటి చెరువులను ప్రారంభించడమేనా ప్రభుత్వ ప్రాధాన్యత

ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో నీటి ఎద్దడి..

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత ప్రేమ్ గౌడ్ తీవ్ర విమర్శలు

గండిపేటక్రైమ్ మిర్రర్: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఉన్నాయని, ఇప్పటికే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస తాగునీటి అవసరాలు తీర్చడంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, మురికి నీటితో నిండిన చెరువులను ప్రారంభిస్తూ ప్రచార ఆర్భాటానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేదని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, చెరువుల పరిరక్షణ వంటి మౌలిక సమస్యలపై సమగ్ర కార్యాచరణ కనిపించడం లేదని ప్రేమ్ గౌడ్ ఆరోపించారు. ఒకవైపు వేసవి తీవ్రత, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో నీటి వనరులపై ఒత్తిడి పెరిగే ఆందోళనలు వ్యక్తమవుతుంటే, మరోవైపు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. చెరువుల అభివృద్ధి పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం కంటే, వాటిలోకి చేరుతున్న మురుగునీటిని అరికట్టి, శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించిన ప్రేమ్ గౌడ్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సింది పోయి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రజలకు కావాల్సింది ప్రారంభోత్సవాల ప్రచారం కాదు.. స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన చెరువులు, నిరంతర నీటి సరఫరా. ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ ప్రచారాలకు స్వస్తి పలికి, నగర ప్రజల నీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రేమ్ గౌడ్ డిమాండ్ చేశారు.



హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా మహేష్ మురళీధర్ భగవత్

ఐపీఎస్ అధికారి నియామకంపై హర్షం..

అభినందనలు తెలిపిన షేక్ ఆరిఫ్ మహమ్మద్

గండిపేటక్రైమ్ మిర్రర్:



హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి శ్రీ మహేష్ మురళీధర్ భగవత్‌కు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా షేక్ ఆరిఫ్ మహమ్మద్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ మురళీధర్ భగవత్ సమర్థవంతమైన పోలీస్ అధికారిగా, ప్రజాసేవకు అంకితమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని షేక్ ఆరిఫ్ మహమ్మద్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పాటు ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్‌లో రాణించాలనుకునే యువతకు ఆయన మార్గదర్శిగా, స్ఫూర్తిప్రదాతగా నిలిచారని అన్నారు. ఎంతోమంది అభ్యర్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేయడం అభినందనీయమని తెలిపారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఆయనకు అప్పగించిన నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక బాధ్యతల్లో మహేష్ మురళీధర్ భగవత్ మరిన్ని విజయాలు సాధించాలని షేక్ ఆరిఫ్ మహమ్మద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

శెట్టిపాలెం యూటర్న్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి!

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన యువకుడు



క్రైమ్ మిర్రర్, వేములపల్లి: నల్గొండ జిల్లా, వేములపల్లి మండలము పరిధిలోని నార్కెట్ పల్లి – అద్దంకి రహదారి పై వున్నా శెట్టిపాలెం యూటర్న్ వద్ద గురువారం రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో 23 ఏళ్ల యువకుడు బుర్రి లోకేష్ మృతి చెందినట్లు మండల ఎస్ఐ సురేష్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారంగా... నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలము దాచారం గ్రామానికి చెందిన బుర్రి లోకేష్ బైక్‌పై మాడ్గులపల్లి నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో శెట్టిపాలెం యూటర్న్ వద్ద పాములపాడు వైపు వెళ్లేందుకు పాములపహాడ్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సబ్బు మహేందర్ రెడ్డి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నట్లు సమాచారం. ట్రాక్టర్ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా, తగిన జాగ్రత్తలు పాటించకుండా యూటర్న్ తీసుకోవడంతో బైక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేష్ తలకు తీవ్ర గాయాలై రక్తం స్రవం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు అని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ రెడ్డి పేర్కొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-11-2026
9

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీకి ప్రతిష్ఠాత్మక 'క్వాలిటీ మార్క్' గుర్తింపు

ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా ఐఎస్ఓ సర్టిఫికెట్ ప్రదానం..

దేశంలోనే ప్రత్యేక 5 స్టార్ రేటింగ్ సాధించిన పోలీస్ శిక్షణ సంస్థగా మరో ఘనత







గండిపేట(క్రైమ్ మిర్రర్): పోలీస్ అధికారులకు నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు పరిపాలన, పరిశుభ్రత, పచ్చదనం, ఆహార భద్రత, మౌలిక సదుపాయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్న ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా అకాడమీకి ఐఎస్ఓ సంస్థ ప్రతిష్ఠాత్మకమైన 'క్వాలిటీ మార్క్' సర్టిఫికెట్‌ను అందజేసింది. ఇప్పటికే 5 స్టార్ రేటింగ్ సాధించిన అకాడమీకి ఈ గుర్తింపు మరో మైలురాయిగా నిలిచింది. నవంబర్ 10న ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ ముగింపు వేడుక సందర్భంగా ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఐఎస్ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య ఈ సర్టిఫికెట్‌ను అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, ఐపీఎస్‌కు అందించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోలీస్ అధికారులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ వస్తున్న ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ, మారుతున్న నేరాల స్వరూపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమకాలీన పోలీసింగ్ అవసరాలకు అనుగుణంగా తన శిక్షణా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటోంది. ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణతో పాటు పరిపాలన, క్రీడలు, వైద్య సదుపాయాలు, ఆహార పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతుల నిర్వహణలోనూ ప్రత్యేక ప్రమాణాలను పాటిస్తోంది. గతంలోనే శిక్షణా ప్రమాణాలు, గ్రీనరీ, పరిశుభ్రమైన ఆహార నిర్వహణ వంటి విభాగాల్లో ఐఎస్ఓ సర్టిఫికేషన్లు పొందిన అకాడమీ, 2024లో ఐఎస్ఓ నుంచి 5 స్టార్ రేటింగ్ సాధించింది. దేశంలోని పోలీస్ శిక్షణా సంస్థల్లో ఈ గుర్తింపు అకాడమీకి ప్రత్యేక ప్రతిష్ఠను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, ఐపీఎస్ మాట్లాడుతూ.. అకాడమీ సాధించిన 'క్వాలిటీ మార్క్' గుర్తింపు ప్రతి ఒక్కరి సమష్టి కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. పోలీస్ శిక్షణలో నాణ్యతను నిరంతరం పెంపొందిస్తూ, ఆధునిక అవసరాలకు అనుగుణంగా అధికారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. అకాడమీలో శిక్షణతో పాటు పరిపాలన, పరిశుభ్రత, ఆహార భద్రత, పచ్చదనం, క్రీడలు, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని వివరించారు. అకాడమీ సాధించిన అవార్డులు, కేంద్ర హోంశాఖ నుంచి లభించిన గుర్తింపులు, ఐఎస్ఓ సర్టిఫికేషన్లు, 5 స్టార్ రేటింగ్ వెనుక అధికారులు, బోధనా సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగుల అంకితభావం ఉందని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తూ దేశంలోనే అత్యుత్తమ పోలీస్ శిక్షణా సంస్థగా అకాడమీ స్థానాన్ని బలోపేతం చేస్తామని ఆమె వెల్లడించారు. ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వార్షిక ఐఎస్ఓ నాణ్యతా ఆడిట్‌లో భాగంగా ఐఎస్ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య, ఐఎస్ఓ క్వాలిటీ లీగల్ అడ్వైజర్ సుందర్ రామయ్య అకాడమీలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, ఎంటీ బ్లాక్, తరగతి గదులు, బోధనా సదుపాయాలు, శిక్షణా కేంద్రాలు, మెస్‌లో ఆహార పరిశుభ్రత, యూనిట్ ఆసుపత్రి, క్రీడాభవన్, బెల్ ఆఫ్ ఆర్మ్, వెపన్స్ వింగ్, శిక్షణా మైదానాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో అమలు చేస్తున్న విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, అందిస్తున్న సేవల గురించి సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలు ఐఎస్ఓ ప్రతినిధులకు వివరించారు. నాణ్యతా దినోత్సవ వేడుకల్లో భాగంగా అకాడమీ ఆధ్వర్యంలో వినూత్నంగా 'క్వాలిటీ హారం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అకాడమీ వాహనాలు, బుల్లెట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించి ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. నాణ్యత అనేది కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా సంస్థలోని ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి పనితీరులో ప్రతిబింబించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండోర్ ఫ్యాకల్టీ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, యూనిట్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ రమాదేవి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (అడ్మిన్) మహేష్, క్వార్టర్ మాస్టర్ శ్రీనివాస్, ఎంటీ వింగ్ శ్రీరాజు, ఔట్‌డోర్ విభాగం సిబ్బంది, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. నాణ్యత, క్రమశిక్షణ, పరిశుభ్రత, సమర్థవంతమైన శిక్షణ అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీకి లభించిన ఈ 'క్వాలిటీ మార్క్' గుర్తింపు సంస్థ భవిష్యత్తు ప్రగతికి మరింత స్ఫూర్తినిచ్చే ఘనతగా నిలిచింది.

శాంతియుత నిరసనకారుల అరెస్టుపై విద్యార్థుల ఆగ్రహం

ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు..

మహిళా ప్రొఫెసర్ల భద్రతపై విద్యార్థుల ఆందోళన






గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని, విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యాపకులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేయడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ అరెస్టులపై విద్యార్థులు తీవ్రంగా స్పందించారు. ఒక మహిళా ప్రొఫెసర్‌కే విశ్వవిద్యాలయంలో భద్రత లేకపోతే, అదే యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న సుమారు మూడు వేల మంది విద్యార్థినుల భవిష్యత్తు, భద్రత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళా అధ్యాపకులకు న్యాయం చేయాలని, వారి భద్రతకు భరోసా కల్పించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు నిరసనలపై స్పందించకుండా అరెస్టులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో మహిళా ప్రొఫెసర్లు, విద్యార్థినులకు భద్రత కల్పించడంతో పాటు, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అరెస్టు చేసిన ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తమ ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

కొత్వాల్‌గూడలో రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూములపై కబ్జా యత్నాలు

ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని శంషాబాద్ తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు



గండిపేట్‌క్రైమ్ మిర్రర్: ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల నుంచి రక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్వాల్‌గూడ 119వ డివిజన్‌లో ఉన్న సర్వే నంబర్లు 626/1, 605లోని ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలతో బీఆర్ఎస్ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. 119వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఈ మేరకు శంషాబాద్ తహసీల్దార్ (ఎమ్మార్వో), రాజేంద్రనగర్ ఆర్డీఓలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొనమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 626/1, 605లో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూములు ఉన్నాయని, వాటిని కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కొంత భూమి ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూమిని వెంటనే గుర్తించి, ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయిన పక్షంలో తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మిగిలిన ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడటంలో నిర్లక్ష్యం వహించకూడదని నాయకులు స్పష్టం చేశారు. రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, జయసింహ, ప్రధాన కార్యదర్శులు పరంధాములు, రాజేందర్, ఉపాధ్యక్షులు మురళి గౌడ్, హనుమంతు ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, దర్శన్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





ఘనంగా తుమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



కూకట్ పల్లి, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్) : తుమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకిస్తూ, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామంతాపూర్ పెద్ద చెరువు వద్ద గుడిసెలు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తుమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం సంతోషకరమని, చెరువుల పరిరక్షణతో పాటు వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ వల్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వివ్ మహేందర్ రెడ్డి,సినీ నటుడు నాగార్జున, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, సిఎంసి కమిషనర్ సృజన,లింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ సందేశంతో బీజేపీవైఎం సైకిల్ ర్యాలీ

గండిపేట చౌరస్తా నుంచి పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వరకు ర్యాలీ..

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా, యువతలో చైతన్యం తీసుకురావడానికి భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీ గండిపేట చౌరస్తా నుంచి పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, వడోదర పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ హేమంత్ జోషి నాయకత్వం వహించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ బీజేవైఎం అధ్యక్షుడు కుండే గణేష్, బీజేవైఎం జాతీయ ఉపాధ్యక్షురాలు మాలోత్ కోమలి తదితర ప్రముఖులు పాల్గొని సైకిల్ ర్యాలీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించడంతో పాటు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతపై సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టి. అంజన్ కుమార్, బీజేపీ నాయకుడు తొకల శ్రీనివాస్ రెడ్డి, నార్సింగి అధ్యక్షుడు మెండే నాగేష్‌తో పాటు పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శుక్రవారం 13-11-2026



ఛట్ పూజకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఆహ్వానం

గండిపేట(క్రైమ్ మిర్రర్): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 123వ డివిజన్ హైదర్షాకోట్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న ఛట్ పూజ కార్యక్రమానికి హాజరుకావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను ఉత్తర భారతీయ సేవా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు కార్యక్రమం వివరాలను ఆయనకు తెలియజేసి, వేడుకల్లో పాల్గొని భక్తులను ఆశీర్వదించాలని కోరారు. ఉత్తర భారతీయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఛట్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ పండుగ ద్వారా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం భక్తులు ప్రార్థనలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఉత్తర భారతీయ సేవా సంఘం అధ్యక్షుడు ధీరజ్ వర్మ, కార్యదర్శి వినయ్ శర్మ, కోశాధికారి విజయ్ మిశ్రా, సంయుక్త కార్యదర్శి వింధ్యాచల్ మౌర్యతో పాటు స్థానిక నాయకుడు హరీష్ గౌడ్ పాల్గొన్నారు. రి

కరువు పరిహారం లేదు.. ధాన్యం కొనుగోళ్లు లేవు.. రైతులకు మిగిలిందేమిటి

తక్షణమే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి

కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్



కోదాడ, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం పేరుతో ప్రకటనలు చేస్తూ, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు పరిహారం అందకపోవడం, మరోవైపు చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం తన నివాసంలో కోదాడ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక పంటలు నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం, బాధిత రైతులకు పరిహారం అందించే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కరువు మండలాలుగా ప్రకటించి ఇన్ని రోజులు గడుస్తున్నా, నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో గుర్తించి పరిహారం అందించలేదని, ఇప్పటివరకు బాధిత రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని ఆయన ఆరోపించారు. కేవలం ప్రకటనలకే పరిమితమవకుండా క్షేత్రస్థాయిలో రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మరోవైపు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకునే సమయంలో రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. పంట కోతలు పూర్తయి ధాన్యం కల్లాలు, రోడ్లపైకి చేరినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే అదనుగా కొందరు దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, దళారుల మధ్య కుమ్మక్కు కారణంగానే ధాన్యం ధరలు తగ్గుతున్నాయని ఆయన విమర్శించారు.ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాల్సి ఉండగా, రైతులు తాము పండించిన పంటను తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి ప్రకటించిన బోనస్‌ను కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, మద్దతు ధర లభించకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వస్తున్న కథనాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని అన్నారు. రైతులు రోడ్లపై ధాన్యం కుప్పలతో రోజుల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు .రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలో తక్షణమే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, బోనస్‌ను వెంటనే చెల్లించాలని బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని కోరారు.రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్న ఆలయాలు..



దీక్షలతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం!

సనత్‌నగర్ దేవస్థానంలో అయ్యప్ప మాలధారణలు

బాలానగర్ నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

ఆలయాల్లో మార్మోగుతున్న స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోష

బాలానగర్, నవంబర్ 12 (క్రైమ్ మిర్రర్) : పరమ పవిత్రమైన కార్తీక మాసం ప్రారంభం కావడంతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శబరిమల అయ్యప్ప స్వామి యాత్రకు సిద్ధమవుతున్న భక్తులు భక్తిశ్రద్ధలతో మాలధారణ స్వీకరిస్తున్నారు. సనత్‌నగర్ దేవస్థానంలో గురుస్వాముల సమక్షంలో అయ్యప్ప భక్తులు సంప్రదాయబద్ధంగా మాలధారణ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మరోవైపు బాలానగర్ ప్రాంతానికి చెందిన అయ్యప్ప భక్తులు స్వామి నామస్మరణతో శబరిమల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది.

మార్మోగుతున్న అయ్యప్ప శరణుఘోష

కార్తీక మాసం ఆరంభంతోనే అయ్యప్ప స్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. సనత్‌నగర్ దేవస్థానంలో భక్తులు గురుస్వాముల ఆశీస్సులతో మాలధారణ స్వీకరిస్తూ మండల దీక్షకు శ్రీకారం చుడుతున్నారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ చేసే శరణుఘోషలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. భక్తులు నియమనిష్ఠలతో దీక్షను కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

బాలానగర్ నుంచి శబరిమలకు పాదయాత్ర

ఇదిలా ఉండగా, బాలానగర్ ప్రాంతానికి చెందిన అయ్యప్ప భక్తులు శబరిమల యాత్రలో భాగంగా పాదయాత్రగా బయలుదేరడం విశేషంగా నిలిచింది. అయ్యప్ప నామస్మరణ చేస్తూ, భక్తిశ్రద్ధలతో యాత్రను ప్రారంభించిన భక్తులకు స్థానికులు శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టనష్టాలను అధిగమిస్తూ స్వామి దర్శనమే లక్ష్యంగా సాగుతున్న ఈ పాదయాత్ర భక్తుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

కార్తీక మాసానికి ప్రత్యేక విశిష్టత

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. 'న కార్తీక సమో మాసో' అనే పురాణ వాక్యం ఈ మాసం గొప్పతనాన్ని చాటుతోంది. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా భావించే కార్తీకంలో దీపారాధనలు, పవిత్ర స్నానాలు, ఉపవాసాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. హరిహరుల అంశగా భావించే అయ్యప్ప స్వామి దీక్షను ఈ పవిత్ర మాసంలో ప్రారంభించడం భక్తులు శుభప్రదంగా భావిస్తారు.

41 రోజుల మండల దీక్ష.. కఠిన నియమాలు

అయ్యప్ప మాలధారణ స్వీకరించిన భక్తులు సాధారణంగా 41 రోజుల మండల దీక్షను ఆచరిస్తారు. ఈ సమయంలో నల్లని వస్త్రాలు ధరించడం, పాదరక్షలు విడిచిపెట్టడం, తెల్లవారుజామున చన్నీటి స్నానం చేయడం, ప్రతిరోజూ పూజలు నిర్వహించడం, సాత్విక ఆహారం తీసుకోవడం, బ్రహ్మచర్యం పాటించడం, నేలపై



నిద్రించడం వంటి నియమ నిష్ఠలను అనుసరిస్తారు. కోపతాపాలకు దూరంగా ఉంటూ మనసు, మాట, ప్రవర్తనలో పవిత్రతను పాటించేందుకు ప్రాధాన్యత ఇస్తారు.

సమానత్వానికి ప్రతీక అయ్యప్ప దీక్ష

అయ్యప్ప దీక్షలోని అత్యంత విశిష్టమైన అంశం సమానత్వ భావన. కులమతాలు, ఆర్థిక స్థితిగతులు, హెచ్చుతగ్గులు అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ ఒకరినొకరు 'స్వామి' అని సంబోధించుకుంటారు. భక్తి, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, సోదరభావం ఈ దీక్షలో అంతర్భాగాలుగా నిలుస్తాయి.

పదునెట్టాంబడి దర్శనమే లక్ష్యం

మండల దీక్షను నియమనిష్ఠలతో పూర్తి చేసుకున్న అనంతరం భక్తులు గురుస్వాముల మార్గదర్శకత్వంలో ఇరుముడి కట్టుకుని కేరళలోని పవిత్ర శబరిమల క్షేత్రానికి చేరుకుంటారు. అక్కడ పవిత్రమైన పదునెట్టాంబడి (18 మెట్లు) అధిరోహించి హరిహరసుతుడు మణికంఠుడిని దర్శించుకుంటారు. మొత్తంగా కార్తీక మాస ఆగమనంతో సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో అయ్యప్ప భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో శబరిమల యాత్రల సందడి ప్రారంభమైంది.

పండెన్ వాగు పరిరక్షణకు సమగ్ర విజిలెన్స్ విచారణ జరపాలి

స్టార్మ్ వాటర్ డ్రైన్ల పేరుతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారనే అనుమానాలు..

పనులు నిలిపివేయాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): పండెన్ వాగు పరిరక్షణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, వర్షపు నీటి కాలువల (స్టార్మ్ వాటర్ డ్రైన్స్) పేరుతో మురుగునీటి పారుదల వ్యవస్థల నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలనలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులపై అనుమానాలు వ్యక్తం చేశారు. సమితి ప్రతినిధుల ఆరోపణల ప్రకారం.. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హ్యూడా కాలనీ నుంచి ఎంప్లాయీస్ కాలనీ వరకు, ఆర్కా టీం 4 బిల్డర్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ నుంచి అంజలి గార్డెన్స్ మీదుగా ఎల్ఐసీ కాలనీ రోడ్డు వరకు, అలకాపూర్ టౌన్‌షిప్, రోడ్ నంబర్ 30, గోల్డెన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో స్టార్మ్ వాటర్ డ్రైన్ల పేరుతో మురుగునీటి పారుదల పనులు చేపట్టినట్లు ఆరోపించారు. ఈ పనులకు సంబంధించిన ప్రణాళికలు, సాంకేతిక అనుమతులు, నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వర్షపు నీటిని తరలించేందుకు నిర్మించాల్సిన స్టార్మ్ వాటర్ డ్రైన్లను మురుగునీటి పారుదల వ్యవస్థలుగా వినియోగించేలా పనులు చేపడుతున్నారనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయని సమితి పేర్కొంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళనను కూడా వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం



పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. స్థానిక కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిపైనా సమితి అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయా పనులకు సంబంధించిన టెండరింగ్ ప్రక్రియ, సాంకేతిక నిబంధనలు, అంచనాలు, నిధుల కేటాయింపు, పనుల అమలుపై సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పర్యవేక్షణలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా? నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలను కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని కోరింది. విచారణ పూర్తయ్యే వరకు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పనులను తక్షణమే నిలిపివేయాలని సమితి స్పష్టం చేసింది. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారులతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వర్షపు నీటి కాలువలు కేవలం వర్షపు నీటిని సురక్షితంగా తరలించేందుకు మాత్రమే ఉపయోగపడాలని, వాటిని మురుగునీటి పారుదల వ్యవస్థల నిర్మాణానికి ముసుగుగా మార్చకూడదని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. పండెన్ వాగు పరిరక్షణతో పాటు పరిసర ప్రాంతాల పర్యావరణ సమతుల్యతను కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు. ప్రజాధనం వినియోగించే అభివృద్ధి పనుల్లో పారదర్శకత, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది.

మహేశ్వరం పేరడు భూమిని కాపాడండి..!

అక్రమ నిర్మాణాలు తొలగించాలని కాంగ్రెస్ నేతల డిమాండ్..?

4 ఎకరాల 6 గుంటల పేరడు భూమికి రక్షణ కల్పించండి --- ఆర్డీఓ కు కాంగ్రెస్ నేతల వినతి

మహేశ్వరం గ్రామ జాతర, పార్కింగ్ కు వినియోగించాలని ఆర్డీఓ కు వినతి..!

ఆక్రమణలు తొలగించి గ్రామ అవసరాలకు వినియోగించాలని డిమాండ్

మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): రంగారెడ్డి జిల్లా:మహేశ్వరం గ్రామంలోని పేరడు భూములను పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు గురువారం కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కి వినతి పత్రం సమర్పించారు.మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఎన్. జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీఓ ను కలిశారు.మహేశ్వరం గ్రామ పేరడు నెంబర్ 1 మరియు పేరడు నెంబర్ 2 లో గల నాలుగు ఎకరాల ఆరు గుంటల భూమిని ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ స్థలాన్ని గ్రామ ప్రజల అవసరాల కోసం వినియోగించాలని, ముఖ్యంగా శివగంగ ఆలయ జాతర ఉత్సవం, రంగు రాట్నాలు, పార్కింగ్ వంటి కార్యక్రమాలకు ఉపయోగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర



వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారు గాల్ల లాజర్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, 11వ వార్డు ఇంచార్జ్ గదాగూటి జంగయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మహేశ్వరం గ్రామ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 10వ వార్డు ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.